


బాల
6 అణాలు
పిల్లల
బొమ్మల
పత్రిక

# "బాల" ఏనుగెక్కింది!

మిఠాయి సంచిక



ఏమి ఏనుగు?
రంగుల ఏనుగు
ఏమి రంగులు?
ఏడు రంగులు
ఏమి ఏడు
రెండో ఏడు
ఏమి రెండు?
పుట్టి రెండు
ఏమి పుట్టి?
బాల పుట్టి
ఏమి బాల?

పిలుపు బాల
ఏమి పిలుపు?
పండుగ పిలుపు
ఏమి పండుగ?
పుట్టింరోజు పండుగ
ఎవరికి?
మన అందాల బాలకే
ఎప్పుడూ?
ఈ ఆగస్టునెలలో
కట్నం?
ఒక రూపాయ మాత్రమే




ఒక రూపాయి కట్నం ఇస్తే "బాల" మీకు ఆగస్టునెలలో ఒక మిఠాయి సంచిక ఇస్తుంది. వెంటనే మీవూళ్లో ఏజంటుతో చెప్పండి - లేకపోతే మాకు రాయండి:

**బాల మిఠాయి సంచిక,**

3, తంబుశెట్టివీధి, మదరాసు 1.


# మోటు, దానియొక్క నలుగురు స్నేహితులు

(వెనుకటి సంచిక తరువాయి)



యూసఫ్ "హమామ్" అను చక్కని బిళ్లను బయటకు తీసెను. నారాయణ "501" అను పసుపుపచ్చని బిళ్లను తీసెను. హమామ్ సమృద్ధిగా నురుగు గలిగి స్నానమునకు యోగ్యమైన సబ్బని మోటు స్పష్టపరచి, నారాయణుని పోయి స్నానము చేయుమని చెప్పెను.

యూసఫ్, రాము, మోటు తమ గుడ్డలను '501' సబ్బుతో ఉతుకుచున్నట్లు నటించి, నురుగు బుగ్గలను విడచుచుండిరి, అది ఎంతో సులభముగాను, హాస్యకరముగను యుండెను.



ఇంకనూ ఎంతో యున్నది.


దీనిని కత్తిరించి మీ స్క్రాప్ పుస్తకములో నుంచుడు.




ది తాతా
ఆయిల్ మిల్సు



కం॥ లి॥




*We all use* **SRIVIS-AMLA**

HAIR OIL

మే మ ం ద ర మూ

శ్రీవిస్ - అమ్లా

తలనూనెనే వాడెదము - ఎందుకంటే ఇతరనూనెలు ఏవివాడినా, కురులు అంత నిగనిగలాడవు. కురులు దువ్వుటకు మృదువుగానుండి, నీటుగా ప్రకాశించును. శ్రీవిస్ - అమ్లా కురులను పెంపొందించు నని కూడ మరువకుడు.




**S. VISWANADHAM & CO**

44, BUNDER ST. G. T. MADRAS

బాలలూ!  ఎవరీమె?

# తెలియదూ?

శ్రీ వెంకట్రామా పిక్చర్సు వారి



# బ్రహ్మరథంలో చూడండి


| మాటలూ, పాటలూ | సంగీతం | నృత్యం | స్టూడియో |
|---|---|---|---|
| కవితాకళానిధి ★ | మోతీబాబు ★ | వెంపటి ★ | శోభనాచల |

దర్శకుడు: చిత్రపు నారాయణమూర్తి బి. ఎ.


అద్దంకి, రఘురామయ్య, జయమ్మ, శ్రీరంజని, కుమారి, అనసూయ
ఇంకా ఎన్నో వేలమంది వాళ్లున్నారు.

ఆంధ్రా: పూర్ణా పిక్చర్సు, గాంధీనగర్, బెజవాడ. రాయలసీమ: మల్లికార్జునా పిక్చర్సు, నంద్యాల. వైజాగ్: దక్కన్ ఫిలిం డిస్ట్రిబూటర్సు, హైద్రాబాద్




EASTERNS 373.




వ్యాపారస్థులకు

## మా మనవి

సరుకులు తక్కువ ధర కిచ్చేస్తలానికే రండి మరియు వ్యాపారస్థుల మన్నికల ననుసరించి. బైటూరి ఆర్డర్లను నిరంతరం సప్లయి చేయుటకు విశేషంగా నిల్వ చేసి వుంచినాము. మా కంపెనీయందు.

| | | | |
|---|---|---|---|
| వన్నరాష్ట్రిం | కస్తూరిపసుపు | వట్టివేరు | పరంగిచెక్క |
| జాజికాయ | మాసుపసుపు | వస | మాచకాయ |
| జాపత్రి | లవంగపట్ట | అక్కల్‌కారా | కచ్చూరాల్ |
| పిప్పళ్లి | లవంగాలు | చలవమిరియాలు | మూశాంబరం |
| వేర్వాళం | వాయువులంగ | ఓమం | పార్‌మర్ది |
| శొంఠి | అజమోదరం | సాంబ్రాణి | సుగంధవేరు |

ఇల్లాంటివి మావద్ద యితర రకాల మందుల మూలికలు లెక్క లేనన్ని లభించును. లభించు స్థలము:


ఎగుమతి దిగుమతిదారులు:

# D. PEIRIS & CO.,

(BRANCH)
24. BADRIAN ST. G. T. MADRAS
(TEL: SUMATIPALA)

PHONE: 5196.
TEL: REDWOOD
NO. 8-10 .. GABO'S LANE,
(HO) PETTAH, COLOMBO.

# బిటాలాక్స్




చాక్లెట్ భేదిబిళ్లలు

సుఖవిరేచనౌషధము

ఇవి చాక్లెట్ భేదిబిళ్లలు. సుఖవిరేచనము కలిగించి మలబద్ధమును పోగొట్టి మంచి జీర్ణశక్తి నిచ్చును.

## పొట్లం 2 బిళ్లలు 1 అణా.

అన్నిచోట్ల దొరకును.

తయారుచేయువారు:

BOMBAY TABLET MANUFACTURING CO.
Post Box No 2092, BOMBAY. 2.

# రీటా తలవెండ్రుకలను పెంచును




రీటా కుదళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు బట్టతల పేను కొరుకు, ఇంకను తలవెండ్రుకలకు సంబంధించిన సమస్తవ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకు వేలు వాడి గుణమును పొందియున్నారు. మీరు కూడ నేటినుండి రీటాయే వాడుడు.

రీటా హిందూదేశమంతా దొరకును, సీసా 15 అ.

**RITA**

**HAIR TONIC**






**'BALA'** CHILDREN'S ILLUSTRATED MONTHLY

సంపాదకుడు: న్యాయపతి రాఘవరావు. బి.ఎ.

సహాయ సంపాదకురాలు: న్యాయపతి కామేశ్వరి, బి.ఎ.,ఎల్.టి.

సంపుటి 2] జూన్ 1947 [సంచిక 11


# ద్రోహం

తల్లి దండ్రుల విధులు - అంటే తమ పిల్లల మంచికోసం తప్పకుండా చేయవలసిన పనులు-అనేకం ఉన్నాయి. పిల్లలకు మంచి చదువు చెప్పించాలి; శుభ్రమైన బట్టలు కుట్టించాలి; ఆట పాటలకు అవకాశం ఇవ్వాలి; ప్రపంచజ్ఞానం కలిగించే విషయాలు చెప్పాలి; ఏపిల్లకి ఎందులో అభిరుచి ఎక్కువగా వుందో అది తెలుసుకొని ఆచదువు చెప్పించాలి; ఆపనులు నేర్పించాలి. ఇవన్నీ తలిదండ్రుల విధులు.

కొంతమంది తలిదండ్రులు బీదవారైనప్పటికీ, పిల్లల యడల తమ విధి గ్రహించి ఎలాగో అలాగ పిల్లల అభివృద్ధికి పాటుపడుతున్నారు. కాని కొందరు తల్లిదండ్రులు గొప్పవారైనప్పటికీ తమ పిల్లల యడల శ్రద్ధవహించకున్నారు. పిల్లలు పుట్టేరు, పెరుగుతున్నారు. అంతే! అంతేకాని పిల్లల యడల శ్రద్ధ ఒక పిసరంతయినా చూపరు. ఇటువంటి తలిదండ్రులు పిల్లలయడల ద్రోహం చేస్తున్నారన్నమాట! ఇట్టి ద్రోహులకు ప్రభుత్వంవారు ఎటువంటి శిక్ష విధించాలో తెలియకుండావుంది.

# తాథాలు, పాఫాలు

త థ — తమ్ముడు వచ్చి
ద ధ — దవనము తెచ్చి
న — నల్ల రిబ్బన్
ప ఫ — పట్టుకొచ్చి
బ భ — బడిలో యిచ్చె
మ — మంచివాడు.

రచన: పి. జయరావు. (తంగుడుబిల్లి)

# కావాలి—కావాలి

| | | | | |
|---|---|---|---|---|
| ఈ | మా | బా | ల | కే |
| ల | ల | ల | బ్భ | ర |
| కు | కు | కు | రు | చ |
| పీ | పూ | బా | బం | న |
| క | లు | లు | తి | లు |

బాలా ! అడ్డంగా చదువుతే అర్థంకాకపోతే నిలువుగా చదువు—నీకే తెలుస్తుంది.

# అ ఆ లతో పెళ్లి

అత్తరు పన్నీరులతో
ఆడపిల్లల హారతులతో
ఇష్టమైన విందులతో
ఈల పాటల వాద్యములతో
ఉత్సవములతో
ఎత్తైన అంబారీల
ఏనుగులతో
ఐదు రోజులు ముత్యాల పల్లకీలో
ఒయ్యారముగా
ఓహో అనిపించు మేళాలతో, ప్రేలే
ఔట్లతో
అంతులేని ఆనందముతో
అః అనిపించారు—
మా బాల పెళ్లి

రచన: కె. యస్. శర్మ (అమలాపురం)



# సెలవు దినాల్లో

౩

పాడ్యమినాడే బయలుదేరితిని
విదియనాడునే వింతలుజూచితి
తదియనాడు తాతయ్యనుజూచితి
చవితినాడునే జూచితినాట్యము
పంచమినాడొక కంచముకొంటిని
షష్టినాడునే సభలో కేగితి
సప్తమి నాపని సఫలంబవగా
అష్టమి తిథినా డాటల నాడితి
నవమినాడునే కవనమునేర్చితి
దశమినాడు దర్శించితి బంధుల
ఏకాదశినా డేగితి షికారు
ద్వాదశినా డొక దేవాలయమును
త్రయోదశి నొక మయూరనాట్యము
చతుర్దశినాడు చలనచిత్రమును
పౌర్ణమినాడొక పులివేషంబును
కన్నులార నేగాంచినవన్నియు
విన్నవించితిని పిన్నలకు.

రచన : నాగవోలు వెంకట అప్పారావు




# ఆడుకో
# పాడుకో



ఆడుకో పాడుకో - అబ్బాయి నీవు
అడ్డురారెవ్వరూ - అలసినదాక
అబ్బాయి ఆటలను - అడ్డుపెట్టేటి
తల్లితండ్రులు జాతి దాశ్యచిహ్నాలు
నీమనసు నీయొడలు నీతలంపులును
నీరక్తనాళాలు - నిర్మలంబగును
నీ స్వేచ్ఛ నరికట్టు నీపెద్దలెల్ల
ఎడతెగని మూఢతకు నిలయములుసుమ్మ
ఎందరో ఠాగూర్లిం కెందరో బోసు
లెందరో గాంధీలు ఎందరోపుట్టి
దేశమాతకు ఋణము దీర్చి రక్షింప
అవకాశమిదె వచ్చె - అబ్బాయిలెమ్మ
ఆడుకో పాడుకో అమ్మాయి నీవు
నీవో విజయలక్ష్మి నిరవాందుగాత !

రచన : చికలూరి లక్ష్మీనరసింహాచార్యులు (సిరిపురం)

# ఎడిటర్ ఎలుకయ్య




ఒకనాటి చరిత్ర

రచన: సూరిశెట్టి సాంబశివరావ్ బాబ్జీ

ఎడిటర్ గా రెవరనుకున్నారు ?
ఎలుక మహాశయులే !—

★



గప్ చుప్ గా ఎలుకయ్యా తలొంచి
కిర్రుమనకా — కిర్రుమనకా
ఏవేవో రాస్తూ వున్నారు
సంపాదన గావిస్తున్నట్టే—

... ... ...

టేబిల్ కుర్చీ అన్నీ హాజర్,
పుస్తకాల దొంతర్లు పడున్నాయ్.
కళ్లకి జోడూ — కాళ్లకి జోడూ —
టేబిల్ పై ఎన్నో కథలున్నాయ్-


★

... ... ...



కోడిశాస్త్రిగారడుగుచుండెరా
మాకథ లెప్పుడు ప్రకటిస్తారు ?

రామచిలుక వచ్చింది ఇంతలో
తలొంచి నమస్కరించి అందిగద:




సంపాదకవర్యా మా గీతం
ఎందుకు మానేరు వేయడం?

... ... ...


జణక్కి జణ జణ
ధిమిక్కి ధిమి ధిమి

బెక బెకమంటూ బెంచీమీదికి
గెంతిపడెను కప్పారా వప్పుడు
"మాకథ లెందుకు పడలే"దని
గోలచేయగా చెప్పా రెడిటర్—



ఎందుకోయి పడతారు గాబరా
వీలును బట్టే ప్రకటిస్తాం;

ఇంతలోన మ్యాం మ్యాం అంటూ
కపి సామ్రాట్ పిల్లీంద్రులు వచ్చిరి
పిల్లిని చూచి ఎడిటర్ సాహెబ్
గుండెలెండినై - వొళ్లుచల్లబడె
ఉక్కిరిబిక్కిరి కిక్కురుమనకా
కన్నవేపుకి పరుగెత్తారు!



# బాలల అక్షరాభ్యాసం

'కవి బాబయ్య'

---

చిన్నరత్నావళీ చిట్టి లక్ష్మమ్మ
తెనుగక్షరా లిపుడు దిద్దుకుంటారు!
ఈశుభ ముహూర్తమున కేతించినట్టి
ఆర్యులందరు గూడి ఆశీర్వదింప!

◆ ◆ ◆

వెండికట్టుల పలక వేడ్కతో మీకు
నాన్న చేయించాడు, నవ్వుతూ మీరు
వాణికి మ్రొక్కి సువర్ణాలు నేడు
రత్నావళీ! లక్ష్మి! వ్రాసుకోండమ్మ!

◆ ◆ ◆

ద్వారబంధమ్ములకు తోరణాల్ కట్టి
గడపలకు పసుపు కుంకమ తీర్చిదిద్ది,
నాల్గు పీటలువేసి నట్టింటిలోను
పసుపు విఘ్నేశ్వరుని భక్తితో చేసి,

◆ ◆ ◆

వెండిపళ్లెములోన బియ్యమ్ముపోసి
బంగారు టుంగరము బాల కిచ్చేరు.
ఉంగరముతో రత్న 'ఓం' వ్రాసింది
ఉంగరముతో, లక్ష్మి 'ఓం' వ్రాసింది.

◆ ◆ ◆

విదుషీమణిని గౌరవించి కానుకల
బాల బాలికలకును పప్పుబెల్లాలు,
పలకలును, పుస్తకాల్, పలక పుల్లలును,
ఫలములును విరివిగా పంచిపెట్టేరు.


తల్లి దండ్రులు ముద్దు తనయలను జూచి
మురిపెంపు నవ్వుల్లో మునిగి తేలేరు!
చూడవచ్చినవారు సొగసు తిలకించి
విందారగించారు విస్తళ్ల ముందు.

♦ ♦ ♦

భావి భారతదేశ భాగ్యోదయమున
స్వాతంత్ర్య నవ్యభావ ప్రకటనలకు
అక్షరాల్ సన్నాహ మగుచున్న వేళ
అక్షరాభ్యాసంబు నందుటే ఘనత!

♦ ♦ ♦

బాగుగా చదవండి బాలికల్లార!
బడిలోకి వెళ్లండి బాలికల్లార!
బాగుగాచదివితే 'బాల'పత్రికలు
బహుమతీ ఇస్తాను 'బాల' పత్రికలు.



రత్నావళి - లక్ష్మి

# వెన్నెల భోజనం

వనవిహారం, వెన్నెల భోజన మనేసరికి పెద్దవాళ్లకే ఆనందం కల్గుతుంది. మరి బాలల సరదా గురించి వేరే చెప్పాలా?

నళిని వేసంకాలపు సెలవులకు మద్రాసు విడిచి యెక్కడకు వెళ్ల లేదు. కాలక్షేపం కాక ఓరోజు తన స్నేహితురాండ్రు పదిమందితో కలసి మద్రాసుకు సమీపంలో వున్న సైంట్ థామస్ మౌంటుకు పిక్ నిక్ వెళ్లదలచింది.

ఆవేళ ఆదివారం సాయంత్రం. పులిహోర మూట కట్టుకొని మౌంటుకు బయలు దేరారు బాలలు. కొండెక్కి నాలుగు మూలలు తిరిగారు. ఇంతలో నిండు చంద్రుడు సముద్రంనుంచి పైకి లేచాడు. చల్లటి పండు వెన్నెల.

అలసిపోయిన నళిని, తక్కిన బాలలు తెచ్చిన పులిహోరను భుజింపసాగారు.

"ఈ కమ్మటి పులిహోరకు పండువెన్నెల మరింత కమ్మదనాన్నిస్తోంది," అంది ఒకబాల. "నిజం" అన్నారు అందరూ. ....

"ఇంతరుచికి కారణమేమిటో తెలుసా" అంది నళిని. "ఏమిటి?" అన్నారు బాలలు.


"పరిమళ భరితమైన తిలక్ మార్కు మిస్కీ యింగువను కొద్దిగా చేర్చాను. దాని కమ్మదనమే," అంది నళిని.

తిలక్ మార్కు యింగువ అంతటా దొరుకును, మరియు **గోపాలీ చాంప్సీ అండ్ కో**, 30, గోవిందప్ప నాయక వీధి, జీ. టి. మద్రాసు, వారివద్ద దొరుకును.

బాలలూ! మీరెప్పుడైనా వెన్నెల భోజనం చేయదలచితే మీ పులిహోరలో **తిలక్ మార్కు** యింగువను వాడుటకు మరిచిపోకండేం?

# పుణ్య స్థలములు

ఈ సెలవుల్లో మీా అమ్మమ్మ, నాన్నమ్మ (బామ్మ) వాళ్లు తీర్థయాత్రలకు వెళ్తే, వాళ్లని యీా చదరంలోవున్న పుణ్య స్థలాలను తప్పక చూడమని చెప్పు.




| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| త | ర్థ | ట | ప్ప | కొం | డ | కా | కో |
| మ | ము | కో | ల | చ | ద్వా | ర | టి |
| రా | చి | కం | ము | హో | సిం | ల్లై | ప |
| బ | ర | ము | శ్రీ | గ | రం | శ్రీ | మ |
| దం | చి | రు | కూ | ము | తి | ర | ఘు |
| ల్లి | పు | త్తూ | ర్మ | ము | రు | వ | ణ్ణా |
| వి | మె | టే | ల | శై | ప | రు | మ |
| శ్రీ | ట్టు | ఒం | ము | శ్రీ | తి | తి | లై |

ఇందులోని పుణ్యస్థలములన్ని మనరాజధాని లోనివే! బాలా! ఏదీ......అవేవో కనుక్కో?

కూర్పు: వుయ్యాల పాండురంగన్

(వేలూరు)



# జాతీయ పతాకం అంటే....?

రచన: పి. శ్రీనివాసరావు (మదరాసు)

ముగ్గుబొమ్మ పంపినవారు: కె. సభా (సేవాసమితి) దిగువమాఘం

జాతీయ పతాకం అంటే తెలుసా నీకు బాలా? అక్కడక్కడ యిండ్ల మీద యెగిరే మూడు రంగుల జండాని చూశావు కదూ? అదే మన జాతీయ పతాకం, అంటే మనదేశాని కంతకీ అదే జండా. ఈ జండాని చూస్తూనే వేరేదేశంవాళ్లకి చప్పున మనదేశం జ్ఞాపకంవస్తుంది.

అట్లాగే ప్రతిదేశంవాళ్లకీ వొక జండా వుంటుంది ప్రత్యేకంగా. ఆజండా ఎగరవేసిన వాళ్లని చూస్తూనే వాళ్లు ఫలానా దేశంవాళ్లని మనం గుర్తించవచ్చు.

ఇంగ్లండు దేశంవాళ్లజండాని "యూనియన్ జాక్" అంటారు. అమెరికా దేశంవాళ్ల జండామీద నక్షత్రాలు, అడ్డగీతలు ఉంటాయి.

మనదేశం జండామీద కుంకుమ పువ్వు రంగు, ఆకుపచ్చరంగు, తెలుపురంగు, రాట్నం వుంటాయి.


ఈజండాని యెప్పుడు అమల్లోకి తెచ్చారో తెలుసా? 1931-సంవత్సరం ఆగస్టునెలలో. అంటే పదహారేండ్ల క్రిందట, అప్పటికి నువ్వింకా పుట్టివుండవు.

మనజాతీయపతాకం రంగుల అర్థమేమిటో చెబుతా విను మరి. కుంకుమపువ్వు రంగు, మన పరాక్రమం, త్యాగబుద్ధినీ తెలియజేస్తుంది.

ఆకుపచ్చరంగు మన భక్తి విశ్వాసాల్ని, శూరత్వాన్ని సూచిస్తుంది. తెలుపురంగు బట్టి మనం సత్యం అహింసలను నమ్మేవాళ్లమని తెలుసుకోవచ్చు.

మన దేశంలో పల్లెలు చాల వున్నాయి. ముఖ్యంగా పొలాలు దున్ని జీవించేవాళ్ల సంఖ్య యెక్కువ. వీరందరికీ రాట్నమే ఆధారం జాతీయ జండామీద రాట్నానికిదే అర్థం.

ఫిబ్రివరి నెల 'బాల' గుర్తుంది కదూ? అందులో 'బాల' డైరీలో జాతీయ పతాకానికి బాలవీరుడు నమస్కారం పెడుతున్నాడు. ఆ విధంగానే మనమందరం జాతీయ పతాకాన్ని గౌరవిస్తాము. భక్తితో నమస్కరిస్తాం.




నువ్వుకూడా జాతీయపతాకాన్ని గౌరవించాలి. అంటే జాతీయ పతాకం సూచించే మంచిగుణాలు నేర్చుకోవాలి సుమా!

ఇందుకు యేంచేయాలో తెలుసా? ఎప్పుడూ ధైర్యంగా వుండాలి. కష్టపడేవాళ్లకోసం నీ సుఖాన్ని అవసరంవస్తే త్యాగం చేసి సహాయపడాలి. పెద్దలంటే భక్తి విశ్వాసం, కనపరచాలని మరిచిపోకు. ముఖ్యంగా అబద్ధమాడడం గానీ, యితరుల్ని అనవసరంగా బాధపెట్టడం, హింసించడం, అనేది చేయకూడదు. యేం?

జాతీయపతాకానికి "జై హింద్" అంటూ నమస్కారం చెయ్యి.

## పోలికలు



ఊహ: జి. వి. ఎస్. రావు (వుంగుటూరు)

# మేకపిల్ల షికారు



మిట్ట మధ్యాహ్నం మిడి మిడి ఎండలో మేకపిల్ల గబగబా వాళ్లమ్మదగ్గరకి పరుగెత్తుకువచ్చి,

"అమ్మా అమ్మా"

"ఒస్తున్నా. ఎండలో పొద్దుణ్ణించీ ఎక్కడికెళ్లావే! అక్కయ్యగారింటి కెళ్లావేమిటి?"

"అక్కయ్యగారిల్లు మనింటి పక్కేగా!"

"అందుకనే నువ్వుకూడా వెళ్లి ఆడుకోవచ్చు, చక్కగా."

"ఊం! ఎప్పుడూ అక్కయ్యిల్లు మనిల్లూ, ఇంకెక్కడకీ వెళ్లనివ్వవు!"

ఇంకా సరిగ్గా పరిగెత్తడమేనా రాదు. ఎక్కడకెళ్లాలేమిటి? పెద్దదాని వయ్యాక తిరగొచ్చు లే కావలసినంతదూరం."

"అందుకే నేనివ్వాళొక గమ్మత్తు చేశా"

"ఏం చేశావేమిటి?"

"నీకు చెపితే ఎక్కడికీ వెళ్లనివ్వవని నీకు చెప్పకుండా షికారెళ్లొచ్చా."

"అయ్యో! అయ్యో! వీధుల వెంట షికారే! ఏందెబ్బలు తగల్లేదు కదా, అమ్మా"

"లేదే ఎంచక్కా ఉంది. వీధుల్లో అన్నీ చూచుకుంటూ వెడితే"

ఇంకా ఇవ్వాళ లేచినవేళ బాగుంది, నాబిడ్డ నాకు దక్కింది. అయితే ఎంతదూరం వెళ్లావు?"

"ఈరోడ్డు వెంబడే వెడుతున్నానే; కొంతదూరం వెళ్లాక అక్కడొక పెద్దఇల్లు కనబడిందే."

"దాంట్లోకి వెళ్లలేదుకదా; ఇళ్లల్లోకి వెళ్లకూడదు. మనుష్యులు చెడ్డవాళ్లు! మన్ని చూస్తే పట్టుకుంటారు."

అదికాదే మరీ, అది బ్రాహ్మల ఇల్లులా వుందే. అంచేత ఎల్లా వుంటుందో చూద్దామని గుమ్మం దగ్గరికెళ్లానే."

"బ్రాహ్మలిల్లయితే ఫర్వా లేదులే. అయినా ఈ కాలపు బ్రాహ్మల్నికూడా నమ్మడానికి వీల్లే కుండా ఉంది. ఊఁ, వెడితే ఏమ యింది?"

"మరేమోనే, ముందు పెద్ద సావిడి ఉందే. దాంట్లో ఎన్నో పుస్తకాలూ, కుర్చీలూ అవ్వీ ఉన్నాయే. ఎవరో ఒకాయన ఒక కుర్చీలో కూచున్నారు. చాలమం చాయనలా ఉన్నారే. నన్నుచూడ గానే లోపలికి రమ్మని పిలిచారు."

"వెళ్లలేదుకదా? అల్లాగే మం చిగా పిలిచి పట్టుకుంటారు వాళ్లు"


"ఏంకాదు, ఆయనెంతో మంచి వారు. నేను లోపలికి వెళ్లగానే నన్ను ఆడుకోమన్నారు, ఎంచక్క!"

"వాళ్లింట్లో పిల్లలెవరూ లేరేమిటె?"

"ఇద్దరబ్బాయి లున్నారు. వాళ్లునన్ను పట్టుకోబోతూంటే ఆయన ఒద్దని కోప్పడ్డారు. అప్పుడు వాళ్లుకూడా నన్ను చూస్తూ ఒక మంచంమీద కూచున్నారు. నేనేమో హాయిగా ఇల్లంతా తిరుగుతూ కావలసినంతసేపు ఆడుకున్నానే! ఆ తర్వాత వాళ్లునాకు తియ్యటి బియ్యం, తవుడూ పెట్టారే."

"తిన్నావేమిటే? కడుపునొప్పి వస్తుందేమో."

లేదే, నాకవ్వి ఎందుకో సయించలేదు. ఇంతట్లోకీ ఆ అబ్బాయి మంచినీళ్లుతెస్తే కడుపు



నిండా తాగేశా. అవ్విగా తాగేక నిద్దరొచ్చిందే, నిద్దరొస్తే ఆయన కూచున్న కుర్చీపక్కన ఇంకోకుర్చీ ఉంటే దాంట్లో పడుకున్నానే"

"అయ్యయ్యో, కుర్చీలో పడుక్కోవడమే! వాళ్లు కొట్టలేదుకదా?"

"లేదే, నేనుకుర్చీలో కూచుంటే వాళ్లంతా నవ్వుతూ సంతోషించి నన్ను నిద్రపొమ్మని చెప్పారే. కుర్చీలో కూచుంటే ఎంత బావుందనుకున్నావు! వెధవది మనింట్లో ఏం బావుండదు."

"మెత్తగా వుంటుందేమిటి?"

"ఊఁ, చాలామెత్తగా వుంటుంది. నీకేం తెలియదు. ఊరికే వీధుల్లో తిరుగుతావంతే. మధ్యాహ్నం రా, నీక్కూడా చూపిస్తాను. అల్లాంటి కుర్చీ నాకోటి కొనిపెట్టవూ?"

"మనకెల్లావస్తాయే కుర్చీలు?"

"ఎందుకు రావేమిటీ? పో నీ నువ్వు కొనక్కర్లేదులే!"

సరే చూద్దాం లే, తర్వాతేమయింది?

"ఆ కుర్చీలో పడుకుంటే నిమిషంలో నిద్ర పట్టిందే. చాలా సేపయ్యాక మెలుకువొచ్చిందే. లేచి కాస్సేపు ఇటూఅటూ తిరిగానే. అప్పుడు కుర్చీలో పడుకుంటే అంత బాగుందికదా, కుర్చీకింద పడుకుంటే ఎల్లావుంటుందోచూద్దామని నెమ్మదిగావెళ్లి కుర్చీకింద పడుకున్నానే. కిందకూడా చల్లగా ఎంతో బాగుందే. ఇప్పటిదాకా అక్కడ పడుకుని నిద్రపోయి ఇప్పుడిప్పుడే లేచానే. లేచాక బలే ఆకలేసిందే."

"అయ్యోపాపం. నన్ను పిలవకపోయావా పాలిచ్చేదాన్ని"

"పిలిచానే, చాలా సార్లు, ఇంట్లోకీ, బయటికీ, తిరుగుతూ పిలిచానే. ఎంత పిలిచినా నువ్వు రాలేదు."

"అయ్యో, నాకు వినపడనే లేదు ఆ పిలుపు, లేకపోతే నువ్వు పిలిస్తే రాకుండా వుండగలనా"

"అప్పుడేమో ఎంతకీ నువ్వు రాకపోతే నేనేవెతుక్కుని ఒచ్చేద్దామని ఆయనతో వెడతానని చెప్పి అరుగు మీదికివచ్చి ఒళ్లు విరుచుకుంటున్నానే. అప్పుడేమైందనుకున్నావు!"

"ఏమైందేమిటి?

"ఆదారినపోయే పిల్లవాడొకడు నన్ను పట్టుకోవాలని నాదగ్గర కొచ్చి ముందు కాళ్లు రెండూ పట్టేసు కున్నాడే"

"అయ్యయ్యో, మరెల్లా విడి పించుకున్నావు?"

"నాకు బలేకోప మొచ్చిందే, వాడు నన్నెందుకు పట్టుకోవా లేమిటే? అప్పుడేంచేశానంటే బలం అంతా తెచ్చుకుని ఒక్కసారి విది లించేసరికి వాడు పారిపోయాడే. నేనుకూడా ఎక్కడా ఆగకుండా పరిగెత్తుకు నీదగ్గరి కొచ్చేశానే. మరి ఆకలేస్తోంది తొందరగా పాలియ్యవే"

"రామ్మారా, పాలుతాగి కాస్సేపు పడుకుందుగాని. ఎండలో తిరిగితే ఒళ్లంతా ఎలా నలిగి పోయిందో, ఎన్నిగండాలు గడి చాయో ఇవ్వాళ నాతల్లికి" అని వాళ్లమ్మ పాలివ్వడానికి తీసికెళ్లింది.

## "అ" సామెతలు

అభ్యాసం కూసువిద్య

అరిచే కుక్క కరవదు

అప్పులేకపోతే ఉప్పుగంజిమేలు

అపకారికయినా ఉపకారమేచేయి

సంపాదన: గోవాడ నిరీక్షణరావు.


## జాబ్‌కో వస్తువులు

అన్నీ స్వదేశీవే.

మీకు కావలసినవి -సబ్బులు నూనెలు, పౌడర్లు మొదలైనవన్నీ జాబ్‌కోవారే తయారు చేస్తున్నారు. మీరు స్వదేశీ వస్తువులనే వాడవలెనని వేరే చెప్పాలా? జాబ్‌కో మార్కుగల వస్తువులే, అన్నిటి కంటే ప్రసిద్ధమైనవి. స్వదేశీవే కొనుడు. జాబ్‌కోనే కొనుడు.

★

మేము తయారుచేయు

వస్తువులు:

హేర్‌గ్రోయర్, స్నో, లిక్విడ్ బ్రిలెంటైన్, బ్రిలెంటైన్, సుగంధపు ఆముదం, సుగంధపు కొబ్బరి నూనె, లైంగ్లిస్, హెర్బాం, శాండల్ ఉడ్ సబ్బులు మొదలైనవి.

★

## జయభారతం కంపెనీ

మదరాసు-బెంగళూరు-ఎర్నాకులం.

# తల తోకా ఊపు పిట్ట


సంపాదన: గుడివాడ వెంకటసుబ్బారావు (ఉంగుటూరు)

మనకి పిట్టలంటే సరదా. పిట్టల్ని పట్టుకోడమంటే మరీ సరదా. అయితే పిట్టలు మనచేతికి దొరుకుతాయా? దొరకవు. అంచేత, మనమే ఒక పిట్టని తయారు చేసి, దానితో ఆడుకోవచ్చును.


పిట్టను తయారు చేయడానికి కావలసినవి:

1. పలుచని అట్ట
2. దారము
3. వెదురు బద్ద


మొదట అట్టను యీ బొమ్మలోలాగా కత్తిరించండి.



తరువాత ఇంకో రెండు అట్ట ముక్కలు యీ బొమ్మలోలాగ, ఒక "తల," ఒక "తోక" కత్తిరించండి:




తల



తోక

ఇప్పుడు 'తల' ముక్క, 'తోక' ముక్క కొనలను (చుక్కలు పెట్టిన చోట్ల) దారముతో కట్టి, ఆ దారము పొడుగుగా వుంచండి. తరువాత మొదట గుండ్రముగా కత్తిరించిన అట్టను మధ్యకు మడిచి అందులో రెండు వైపులను ఒకవైపు 'తల' ఇంకో వైపు 'తోక'


పెట్టి, కుట్టిముడివేయండి. అప్పుడు దాని ఆకారం ఇలాగుంటుంది.



చున్న దారాల్ని వెదురుబద్దకు కట్టిన దారానికి మధ్యన బిగించి కట్టండి. అప్పుడుపిట్ట తయారు అయినట్టే.

పిట్టయొక్క తలా తోకా ఆడించాలంటే ఆ వెదురుబద్దను నొక్కి వదులుతుండాలి. నొక్కితే తలా, తోకా క్రిందకు వంగుతాయి వదులుతే తలా, తోక పైకిలేస్తాయి. బాలా! బాగుందా ఇది?

ఇప్పుడు ఏమిచేయాలంటే-వెదురు బద్దను పల్చగా చెక్కి, ఆపిట్ట పొట్టలో గీత పెట్టిన చోట కోసి, అందులో యీ పల్చగా చెక్కిన బద్దను గుచ్చి, అవతల వైపుకు వచ్చినదానిని, ఇవతల దానిని, వంచి ఒకదారముతో బిగించి కట్టండి. ఇప్పుడు 'తల' "తోక'లకుకట్టి వేలాడు



## "బాల" మిఠాయి సంచిక !

ఆగస్టునెలలో మన "బాల"కు రెండేళ్లు నిండుతాయి. పుట్టినరోజు పండుగ చేసుకొని, మీకోసం ఒక రంగురంగుల మిఠాయి సంచిక అచ్చు వేస్తుంది.

వెల 1 రూపాయి మాత్రమే.




రచయిత:- కొండపల్లి వెంకటరామదాస్, తుని.

# "4వ మజిలీ"

నాల్గవ మజిలీ చేరుకోనీ చేరుకోడంతోనే మన బాలయ్య మార్గంలోజూచిన వింత విషయమై అడుగుతే, తాతయ్య ఓ చిరునవ్వు నవ్వి, చిన్న చిమతాకొట్టి కథ ఇలా సాగిస్తున్నాడు.

## గవర్సెట్టి కథ

బాలయ్యా! ఒకానొకప్పుడు మార్గంలో మనం చూచిన పట్టణం బ్రహ్మానంద రాజుగారి రాజ్యంలోది. ఈరాజుగారి పట్టణంలో "వీరాశెట్టి" అనే గొప్ప రత్నాల వర్తకు డుండేవాడు. ఈ వీరాశెట్టికి "గవర్సెట్టి" అనే, ఒక్క "సుపుత్రుడు" మాత్రం కలడు. ఎటు చూచినా ఒక్కడే కావటం వల్ల శెట్టిగా రబ్బాయ్, ముద్దుచే ముద్దులా తయారయ్యాడు. పోనీ, చదువు సంధ్యలు వంటబట్టకపోతే పోయె! సహవాసాలన్నా మంచివికావు! ఎలాంటి వాళ్లకు అలాంటి స్నేహితులు తయారవుతారన్నట్లుగా, "శాస్త్రి", "వీర్రాజు" "పోలయ్య" అనే ముువ్వురు అచ్చువేసి విడిచిన ఆంబోతు స్నేహితు లున్నారు. అయితే! లోకంలో ఎక్కడైతే చెడ్డవుంటుందో, అక్కడే కొంత మంచికూడా వుండటం సహజం! అలానే, మన శెట్టికి "రాము" అనే మంచి స్నేహితుడు వుంటూండేవాడు. కాని, తనచెడు స్నేహితుల ప్రోత్సాహంలో, రాముయొక్క మంచి బుద్ధులు తలకెక్కేవి కావు గవర్సెట్టికి. పైగా రాము అంటే అసహ్యాంచుకొనేవాడు.

వీరాశెట్టికి కొడుకు గోల రోజుకు రోజూ హెచ్చయి పోతోంది. కొడుకు అల్లరివల్ల తోటివారలలో గౌరవం తగ్గిపోసాగింది. తనకు ముద్దయితే ఇంట్లో నెత్తెక్కించుకోవాలిగాని, ఊరు మీదవిడిస్తే ఎవరూరుకొంటారు? చివరకి తన కొడుకును ఏదో కొంత డబ్బిచ్చేసి, ఏదూరదేశం అయినా స్వంతంగా బతకమని పంపిస్తే, కొంత కాకపోతే కొంతైనా ఈ చెడు సహవాసాలు వదలటంవల్ల బాగుపడొచ్చుగదా అనే ఓనిశ్చయాని కొచ్చాడు. అందుకు ఏర్పాటులన్నీ రహస్యంగా చేయసాగాడు! ఒహవేళ! తనఏర్పాట్లు కొడుకు ప్రయాణం రోజులోపల తెలిస్తే ముప్పు వస్తుందని వీరాశెట్టి అభిప్రాయం!

విను బాలయ్యా! ఒకొక్కప్పుడు తల్లిప్రేమకూడా పిల్లల్ని పాడుచేస్తుంది. తనకొడుకు తనను విడిచి దూరంగా పోతాడన్న దుఃఖముతో గవర్సెట్టి తల్లి గవర్సెట్టికి, అతని ప్రయాణం గురించి ముందుగానే చెప్పేసింది! ఇంకేవుంది! కొంప మునిగింది! గవర్సెట్టి తన ఇష్టుల్తో ఆలోచించుకొన్నాడు. ఎలా అయితేనేం తను కూడా దూర ప్రయాణానికి ఒప్పుకొన్నాడు. లోలోపల శాస్త్రీవగైరాల మంతనాలు ఎప్పటి కప్పుడు శెట్టిని కనిపెడుతూవున్న రాము మాత్రం తెలుకున్నాడు. వీలైతే తన ప్రాణాలొడ్డైనా, తన స్నేహితుడిని రక్షించా లనుకొన్నాడు రాము!


ప్రయాణం చేయవలసిన నాడు వీరాశెట్టి, కొడుక్కి బుద్ధులుచెప్పి, జాగ్రత్తగా వుండమనిచెప్పి, ఓడ ఎక్కించాడు. గవర్సెట్టితల్లి, కన్నీళ్లతో కొడుకును దీవించింది. ఎవ రెలావున్నా మన శెట్టిమాత్రం చాలాకులాసాగా వున్నాడు. మెల్లగా గవర్సెట్టి ఓడ కదిలింది. అలా మూడవరోజు మార్గంలో శాస్త్రీ వగైరాలు ఓ చిన్న పడవలో వచ్చి శెట్టిని కల్సుకున్నారు. శెట్టి సంతోషంతో వాళ్లని తనఓడలో యెక్కించుకొన్నాడు. నాల్గవ రోజున, ఇంకో పెద్ద పడవ చాలామంది రాజసైనికుల్తో నిండినది, కొంచెందూరంలో, శెట్టిఓడను అనుసరిస్తోంది. సరి!

అయిదవరోజున రాత్రి, శాస్త్రి వగైరాలు, పడవవాళ్లలో చాలా మంది నిద్రబోతూన్న సమయంలో శెట్టి సొమ్మునంతా కాజేసి, నిద్రబోతూన్న శెట్టిని ఒక్కసారి సముద్రంలో పడేశారు! చూడు బాలయ్యా దుర్మార్గు లెంతపనిచేశారో!

అదృష్టాన్న "శెట్టి" రాజభటుల ఓడలో వున్న ఒకని సహాయంతో రక్షింపబడ్డాడు. వెంటనే రాజ భటులు, శాస్త్రి వగైరాలను పట్టుకుని, శెట్టీ వాళ్ళున్న పట్టణానికి తీసుకువచ్చేశారు! జరిగిన ప్రాయశ్చిత్తంవల్ల మన శెట్టికి బుద్ధి వచ్చింది. తను ఎంత నీచంగా చూచినా, తననీవిధంగా రక్షించిన "రాము" మాట ఇహ జన్మలో దాటనని ప్రతిజ్ఞ చేశాడు. కొడుక్కు బుద్ధి వచ్చినందుకు శెట్టి తల్లి తండ్రు లెంతో సంతోషించారు.

అవతల రాజభటులు శాస్త్రి, వీర్రాజు, పోలయ్యలను బ్రహ్మానందరాజుగారి ఎదుట పెట్టారు. ఆయన జరిగినదంతా విని, వాళ్లని కొన్నాళ్లు ఖైదులో పెట్టించాడు. ఇదిగదా సంగతి! బాలయ్యా! నీవుకూడా జాగ్రత్త పడాలి సుమా ఈ విషయంలో అని తాతయ్య సారాంశం తేల్చగా, మన "బాలయ్య" తాతయ్యకు హామీ ఇచ్చి, తరవాయి కార్యక్రమాలు చేస్తూన్నాడు తాతయ్యతోసహా!

## ఆటలలో ఆనందం



# మనగేదెగిట్ట



బుర బుర లేచేడు-బూడిద గుండు

టెక టెక లేచేడు_టెంకాయగుండు

గుండూపోయీ-కోటలో పడితే

చిన్నన్న కోటలో_జింకల్లు బెదిరె

పెద్దన్న కోటలో - పెయ్యల్లుబెదిరె

అల్లిబిల్లిమన - ఆవులకింద

చెల్లికివేసిన - దూకుడు దండ.

దండాకాదుర - తామర మొగ్గ

మొగ్గాకాదుర - మోదుగనీరు

నీరూకాదుర - నిప్పులబావి

బావీకాదుర - బచ్చలికూర

కూరాకాదుర - గుమ్మడిపండు

పండూకాదుర - పాపడిమీసము

మీసముకాదుర - మిరియాలపోతు

పోతూకాదుర - పొలిమేరగట్టు

గట్టూకాదుర - గవళ్లవాడ

వాడాకాదుర - వరికూటిముద్ద

ముద్దాకాదుర - ముంతెడుచల్ల

చల్లాకాదుర - చాకలిచిట్టి

చిట్టీకాదుర - చీపురుకట్ట

కట్టాకాదుర - కలబందుమట్ట

మట్టాకాదుర - మనగేదెగిట్ట



సంపాదన: జి. సన్యాసిరావు (వైజాగ్)



# అంటు వ్యాధులు

రచన: "సుబ్రాయుడు — మెడికో"

"ఏటవతల అమ్మోరి గుళ్ళోకి వస్తావా బావా?"

"ఏమిటీ విశేషం?"

"అబ్బే యేమీలేదు. అమ్మ అమ్మోరికి చలివిడి పానకాలు గొర్రెనీ కోళ్లను యిస్తానని మొక్కుకుందట. మేమంతా వెడుతున్నాం"

"ఎందుకు మొక్కింది"

"ఊళ్లో బాగోలేదని. చూడు యీ మధ్య మనవూళ్లో చాలా మంది మసూచికాల వల్ల, టైఫాయిడ్ జ్వరాలవల్ల చనిపోలేదూ?"

"వూళ్లో బాగో పోతేఅమ్మోరికి బలివ్వడ మెందుకు ఆ నోరులేని జీవనాల్ని? కడుపునొప్పి వస్తే కంటికి మందేసినట్లే వుంది."

"అమ్మోరికి కోపంవస్తే వస్తాయంటారుగా ఈ రోగాలు?"

"ఎవరు చెప్పారు జయా నీకు?"

"అంతా అలాగే అంటున్నారుగా. నిన్న అమ్మకూడా అంది"

"కాదమ్మా! యీ రోగాలు వచ్చేవి అమ్మోరి వల్ల కాదు. సూక్ష్మ జీవుల వల్ల వస్తాయి."

"సూక్ష్మజీవుల వల్లా? వాటి మూలాన్న అంతామేలే కలుగుతుందని మొన్నటి బాలలో వ్రాశారు గదా నీవు కీడుకూడా కలుగు తుందంటావేమిటి?"

"నిజం జయా. మనకు అపకారం చేసే క్రిములు కూడా వున్నాయి."

"ఉపకారం చేసేవే అపకారం చేస్తాయా?"

"కాదు 100 పాళ్లల్లో 1 పాలు మాత్రం మనకు అపకారం చేస్తాయి; మిగత 99 పాళ్లు వుపకారంచేసేవే. లేకపోతే ప్రపంచం తల్లక్రిందు లైపోదూ?"

"ఏమిటి బావా యీరోగాలు ఒకళ్లకి వచ్చిందంటే వూరంతా చుట్టేస్తాయి?"

"అవును జయా అదంతా ఆసూక్ష్మ జీవుల ప్రభావమే. ఈ వ్యాధులు ఒకమనిషి నుండి మరొక మనిషికి తేలికగా ప్రాకుతాయి. అందుచేతనే వీటిని అంటు వ్యాధులన్నారు."

"వీటివల్ల అంతంత జననష్టం కలుగుతూంది గదా వాటినుండి రక్షింపబడే మార్గాలు లేవా బావా?"

"ఎందుకులేవు? పల్లెటూళ్ల లోని ప్రజలకు యీవిషయాలు తెలియక వాటికి బలి అవుతున్నారుగాని"

"ఆరోగాలు మనదగ్గరికి రాకుండా చేసికోవచ్చన్నమాట"

"తప్పకుండా. టైఫాయిడ్ జ్వరం, కలరా యివి సూక్ష్మజీవుల వల్ల కలుగుతాయి. ఈరోగాలు ప్రబలి వున్న రోజుల్లో నీళ్లు, ఆహారం పరిశుభ్రంగా వుండే టట్లు చూడాలి. వర్షం కురిస్తే నీరంతా చెరువుల్లోకి కాలవల్లోకి, కొట్టుకు వస్తుంది. వచ్చేది వూరికే వస్తుందా; దారిలో నున్న మలినాన్ని అంతా తీసుకువస్తుంది. ఆమురికిలో యీ జీవులుంటాయి. అచ్చట చాలా కాలం జీవిస్తాయి కూడాను. ఆనీరే మనం త్రాగేమాంటే అది మన కంటుకుంటుంది. అంచేత అటువంటి నీళ్లు శుభ్రపరచి మరుగ కాచి మరీ త్రాగాలి. ఈగలవల్ల కూడా వస్తాయి ఇటువంటివి. ఈ దరిద్రపు ఈగలు మురికిమీద వాలి మళ్లా మన ఆహారపదార్థాల మీదపడి వాటిని మైల పరుస్తాయి. ఆక్రిముల్ని మురికినుంచి మనకు చేరుస్తాయి. వాటివల్లే ఈరోగాలు. కాబట్టి మన పదార్థాలమీద ఈగల్ని వాలనీయకుండా కాపాడాలి."

"క్షయకూడా అలాగే వ్యాపిస్తుందా బావా?"

క్షయ మరొక శత్రువు మనకు జయా. దానివల్ల వేనకు వేలు జన నష్టం కలుగుతుంది. ప్రతి

సంవత్సరం అనేక కుటుంబాలు నాశనమై పోతున్నాయి. ఇది చాలా చిన్న సూక్ష్మ జీవుల వల్ల వస్తుంది ఒక తలవెండ్రుక కొనస్థలంలో కొన్ని కోట్ల జీవులుంటవంటే నీకు ఆశ్చర్యంగా లేదూ? ఈ వ్యాధి యెలా వ్యాప్తి జెందుతుందో తెలుసా? క్షయరోగి యెవడైనా దగ్గాడంటే వాడి నోట్లోంచి వచ్చే తుంపరలద్వారా కొన్ని క్రిములు బయటికి వస్తాయి. అవి గాలిలోను దుమ్ములోను కలుస్తాయి. ఆగాలినే మనం పీల్చామంటే అవి మనలో చేరతాయి. అంచేతనే మనం క్షయరోగులున్న చోటికి పోకూడదు."

"అయితే మా అన్నయ్య వాళ్లో మామగారికి క్షయవచ్చిందని చూడ్డానికి నన్నూ మా చెల్లాయినీ తీసికెళ్లేవాడే!"

"అది మీ అన్నయ్యకు తెలియక చేసిన పని. ఈ విషయాలు మీ అన్నయ్యకు ఒక్కడికే కాదు. ఇంకా చాలా మందికి తెలియవు. దానికి ఫలితంగా బాధపడుతున్నారు. దీనికంతకూ కారణం చదువు లేకపోవడం."

"మశూచికమో?"

"అది మరీ భయంకరమైనది. రోగుల్ని తాకటం వల్లవచ్చే వ్యాధుల్లో యిదొకటి. యిదివచ్చిందంటే ప్రాణమేతీస్తుంది. లేకపోతే కురూపినైనా చేసి విడిచి పెడ్తుంది. యిటువంటివి రాకుండానే మన ప్రభుత్వంవారు చిన్నప్పుడే మనకు టీకాలు, యింజెక్షన్లు వేస్తారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకునే దానికంటే చేతులు కాలకుండా చూచుకోవడం మంచిది కదూ!"

"అసలీ టీకాలేవిటి బావా?"

"వాటిని గురించి చెప్పాలంటే చాలావుంది. ఈ సారెప్పుడైనా చెప్తాలే."

# ★ లేదు — కద్దు ★

బాలా! బెల్లము తియ్యగా వుంటుంది కదూ? కాని యీ దిగువ పద్యం చదువు - అందులో ఎలాగు వ్రాసివుందో -

బెల్లము తీపి లేదు
పేదవానికి ధనము కద్దు
నల్లని కాకి ఇలను లేదు
నిను గొల్చిన వానికి కీడు రాఘవా!

ఇందులో అన్నీ అబద్ధాలే! ఈ పద్యంకూడా చదువు -

చింతకు పులుపు లేదు
ఎఱ్ఱచీమకు తొండము కద్దు
జాజిపూ బంతికి వాసన లేదు
నిను గొల్చిన వానికి కీడు రాఘవా!

ఇందులోనుకూడా అబద్ధాలే! అసందర్భాలే! కాని యీ పద్యాలనే ఇంకో విధంగా నీవు చదివితే అర్థం సరిగావుంటుంది. ఏదీ-ప్రయత్నించు. (సరియైన జవాబు యీ సంచికలోనే వుంది)

సంపాదన: అప్పల శ్రీరాములు (కనిగిరి).




# మేఖభవనాలు

చిట్టి చౌదరి బీద కుటుంబములో పుట్టినా అతని ఆలోచనలు ఆకాశాలు దాటేవి.

ప్రొద్దున్నుంచి పద్దాక తండ్రి చేసే లక్కపిడతల వ్యాపారంలో సాయపడేవాడు చిట్టిచౌదరి. చేతులతో పనులు చేస్తున్నా కండ్లు ఆకాశం వైపే ఉండేవి. ఆలోచనలు ఆకాశాన్ని దాటేవి.

ఆకాశాన అటూ యిటూ తిరిగే మేఖాలను పిలిచేవాడు చిట్టి చౌదరి. ఆ మేఖాలలో మంచి మంచి భవనాలుండేవి అని ఆ పిల్లవాడి ఊహ.

తన తండ్రి పూరి పాకను విడిచి ఆ భవనాలలో తిరగాలని అతని సరదా. ఆచోట అనేక రకాల పూలు పిట్టలు ఉన్నాయి. పిట్టలు అక్కడున్నుంచే వస్తాయి.

రాత్రి వేళలలో నిద్రతోట తలుపు తీసి ఆ మేఖ భవనాలలోకి పాకి పోవచ్చును గదూ! ఎవరైనా పో వచ్చు. మహారాజుగాని మేదర వాడుగాని నిద్రతోట తలుపులు తీస్తే ఆ భవనాలలో విహరించ వచ్చు.

నిద్రతోటలో దీపావళీ లాంతర్లు మూల మూలలా ఉన్నాయి. అయితే అవన్నీ చెట్లకొమ్మలపైన వేళ్లాడుతూ ఉంటాయి. వాటినెలా పట్టుకోవడం?

రచన:
శిష్ట్లా ఉమామహేశ్వరరావ్


ఓ రాత్రి చిట్టి చౌదరి ఒక గడ కర్ర పట్టుకుని నిద్రతోట ప్రవేశిం చాడు. అక్కడున్న చిత్ర విచిత్ర దీపాలను చూచాడు. గడ కర్ర ఎత్తి ఒక దీపాన్ని అందుకో పోయాడు. వాడు బొటన వేళ్లపై నుంచున్నా దీపం అందలేదు. గుట కలు మింగుతూ ఏడవడం మొద లెట్టాడు.

అదే సమయాన వీరనాయుడు యుద్ధదుస్తులు వేసుకుని పెద్దగుర్ర మెక్కి ఆ దారి పోతూ ఆయేడు స్తున్న పిల్లవాడ్ని పిలిచి "అబ్బా యీ ఎందుకేడుస్తున్నావు?" అని అడిగాడు.

"ఆ ఆకాశ దీపాల నందుకో వాలంటే అందడం లేదండీ!" అన్నాడు చిట్టి చౌదరి.

"నా గుర్రమెక్కి నా బుజం మీదకూర్చో అందుతాయి" అన్నాడు వీర నాయుడు.

రెక్క లెగరేస్తూ చిట్టి చౌదరి వీరనాయుడి బుజంమీద కూర్చు న్నాడు. ఆ ఆకాశ దీపాలలో దేన్ని తెంచుకుందామా అని ఒక్కొక్కటే చూడ నారంభిం చాడు. వాటిని చూస్తూ సంతో షిస్తూ కేరింతలాడుతూ తబ్బిబ్బు లై పోతున్నాడు. ఓ లాంతరును పట్టుకుంటే ఆ ఆకాశ వీధుల్లోంచి ఎక్కడకు పడితే అక్కడకు పోవచ్చుగదా అనుకున్నాడు. చివ



రకు ఇంద్రుని ఇంటికి కూడా పోవచ్చు! అక్కడుండే పిల్లలతో ఆడుకోవచ్చు. కూటికి గుడ్డకు కరువుగా వుంటే యీ లక్కపిడత ల వ్యాపారమేనా బ్రతికినన్నాళ్లూ!

వీరనాయుడు చిట్టి చౌదరి చేసే గల్లంతును పాటించలేదు. ఆయన భావాలుకూడా అంతులేకుండానే ఉన్నాయిగాని వేరు వేరుగా ఉన్నాయి. ఇంతలో దూరాన యుద్ధ కలకలం వినవచ్చింది. ఆ కల కలానికి అలవాటుబడ్డ అతని గుర్రం చెంగుమంటూ ముందుకు సాగింది. అంతయెత్తునుంచి చిట్టి చౌదరి క్రింద పడ్డాడు.

నిద్రలేచి చిట్టి చౌదరి చుట్టూ చూచేసరికి తన తండ్రి యింట్లో తన గోనెపరుపుమీద తానున్నాడని గ్రహించాడు.

తండ్రి మాత్రం ఆనాటినుంచీ చిట్టి చౌదరి ముఖంలో క్రొత్త చురుకుదనం ఉండడం చూచి ఆశ్చర్య పోయాడు.


మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

బాధపడుచున్న యెడల వెంటనే

పాత్రుడుగారి

# బాలసంజీవిని

యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు:

డా॥ పిల్లా పాపయ్యా పాత్రుడు & బ్రదరు,

11 దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

| కుంభకోణం బ్రాంచి: | తిరుచినాపల్లి బ్రాంచి: |
|---|---|
| నెం. 7, సారంగపాణి కోవిల్ తూర్పువీధి. | నెం. 15, పుగళైపిళ్ళై వీధి, తెప్పకోలం |

# బాలా! నీకు తెలియునా?

- ప్రపంచములోని ద్వీపములలోకెల్ల "గ్రీన్‌లాండు" పెద్ద ద్వీపము. దీని విస్తీర్ణము 838,000 చదరపుమైళ్లు.

- అమెరికాదేశములోని కాలిఫోర్నియా యను పట్టణములోని పార్కునందు "హర్‌మిాన్" యను వృక్షముకలదు; దాని వయస్సు 5,000 సంవత్సరములు.

- ప్రపంచములోని గ్రంథాలయములన్నిటికంటె రష్యాలోని "నేషనల్" గ్రంథాలయము పెద్దది. ఇందు 7,097,000 గ్రంథములు గలవు.

- ప్రపంచములోని బురుజు లన్నిటికంటె బీజపూర్‌లోనున్న "గోల్ గుంబజ్" బురుజు పెద్దది. దీని వ్యాసము 144 అడుగులు.

- "సహారా ఎడారి" లోకములోకెల్ల పెద్దఎడారి. దీని విస్తీర్ణము 20 లక్షల చదరపుమైళ్లు.


- ప్రపంచములోని జంక్‌షన్‌లలోకెల్ల ఇంగ్లాండులోని "క్లేప్‌హేమ్" **(Clapham)** జంక్‌షన్ చాల పెద్దది. ప్రతి 24 గంటలలోను 2,500 రైళ్లు మారుచుండును.

సంపాదన: గుడివాడ రాజేశ్వరరావు. (శ్రీగాకుళము.)

## "బాల" ఎడ్రసు మార్పు

ఇకముందు "బాల"కు మీరు రాసే ఉత్తరాలు,

3. తంబుచెటి వీధి. మదరాసు 1. అని వ్రాయండి.



# పలికే పెట్టె

రచన: డి. శ్రీనివాసరావు

మనిషి మనిషిలా మాట్లాడ గలడుగాని కుక్కలా మొరగ మంటే యెలా మొరుగుతాడు! పోనీ కుక్కని మనిషిలా మాట్లాడ మనండి చూద్దాం. ఎంతకొట్టినా మొరుగుతుంది గాని మనలా మాట్లాడలేదు. మద్దెలని ఎల్లా వాయించినా మద్దెలలా మోగుతుందిగాని బాకాలా "తూతూ" అనదు. బాకాని వూదితే 'తూతూ' అంటుందిగాని మద్దెలలా "తధిగిణతోం" అనదు.

కాని మనిషి కనిపెట్టిన వస్తువు ఒకటివుంది. అది మనిషిలా మాట్లాడుతుంది, కుక్కలా మొరుగుతుంది, మద్దిల్లా మ్రోగుతుంది కూడాను. ఒక టేమిటీ అన్నీని. అదేమిటో మీకు తెలుసునా? అది గ్రామఫోను.

గ్రామఫోను వినడముఅంటే ఎంతో సరదాకదూ! అల్లాంటి గ్రామఫోను ఎలా పనిచేస్తుందో,

ఒక గంటమీద కఱ్ఱతోగాని చేత్తోగాని కొట్టండి; గంట మ్రోగుతుంది. గంటని కొట్టినప్పుడు గంట అదరడం మొదలుపెట్టుతుంది. అల్లా గంట అదురుతున్నట్టు మనకుపైకి కనిపించదుగాని గంటనికొట్టి, మనచేతిని గనక గంటమీద పెట్టితే గంట అదురుతున్నట్టు తెలుస్తుంది. ఈ అదరడానినే కంపించడం అంటారు. గంట, గాలిలో కంపించితే శబ్దము బయలు దేరుతుంది. అట్టే పేము బెత్తాన్ని గట్టిగా గాలిలో అటు యిటు వూపితే, అంటే కంపించేటట్లు చేస్తే, రివ్వుమని చప్పుడు వినిపిస్తుంది. చేతిలోని చెంబుజారి క్రిందపడితేకూడ శబ్దము వినిపిస్తుంది. కారణం! క్రిందపడి దెబ్బకి చెంబు కంపించిం దన్నమాట. గాలిలో యేదైనా వస్తువు కంపించినట్లయితే మనకు శబ్దము వినిపిస్తుంది. ఇంతెందుకూ

గొంతుకలోవుండే ఓకల్ కార్డు లనేవి కంపించడము వల్లనే మాటలు వినబడతాయి. ఏవస్తువైనాసరే గాలిలో యేమాత్రము కదిలినా శబ్దము పుట్టుతుంది. కాని అన్ని శబ్దాలనీ మనం వినలేము. నెమ్మదిగా పేముబెత్తాన్ని యిటు అటు వూపితే మనకి వినిపించదు. కాని గట్టిగా వూపితే రివ్వుమనెడు శబ్దము వినిపిస్తుంది.

ఒక పల్చటి కాగితాన్ని మీ నోటిదగ్గరసా పెట్టుకుని మాట్లాడండి, మీరు మాట్లాడినప్పుడు మీ ముందువున్న గాలి కంపిస్తుంది. ఆగాలి మీ నోటిదగ్గరగా వున్న కాగితాన్ని కంపించేటట్టు చేస్తుంది. కాగితం కంపిస్తూ వున్నట్లు మీ చేతి వ్రేళ్ళకి తెలుస్తూనే వుంటుంది, "రాముడూ" అనిఅంటే ఒకలా కాగితము కంపిస్తుంది, "పుల్లయ్యా" అంటే యింకోలా కంపిస్తుంది. ఆ కాగితాన్నే కుక్క మొరిగేటప్పుడు దాని నోటిముందుపెట్టితే మరోలా కంపిస్తుంది. కాని, కాగితములో అనేకవిధాలుగా శబ్దాలను బట్టి కంపిస్తోన్నట్లు పైకికనిపించదు.

ఇప్పుడు ఎవరేనా పాడిన పాటని యెల్లా గ్రామఫోను ప్లేటులోకి యెక్కిస్తారో తెలుసుకుందాము. పాడేమనిషి కాగితంలాంటి పల్చటి లోహపు పొర ముందు పాడతాడు. మనిషి పాడుతూవుంటే పల్చటి లోహపు పొర కంపిస్తూ వుంటుంది. ఈ లోహపు పొరకి చిన్న గ్రామఫోను ముల్లులాంటిది వుంటుంది. ఈ ముల్లుకూడా లోహపుపొర యెల్లా కంపిస్తే అల్లా కంపిస్తూ వుంటుంది. ఒక గ్రామఫోను ప్లేటులాంటిది గిరగిరా తిరుగుతూ వుంటుంది. యీ ప్లేటు మెత్తగా వుంటుంది. లోహపు పొరకున్న ముల్లును గిరగిరా తిరిగే మెత్తని ప్లేటు మీద ఆనిస్తారు. మనిషి పాడడము మూలంగా లోహపుపొర దానికివున్న ముల్లు కంపిస్తూ వుంటాయని తెలుసుకున్నాము. ఆ కంపించే ముల్లుని యీమెత్తని ప్లేటుమీద పెట్టగానే, ప్లేటు మెత్తగా వుండడమువల్ల ముల్లు ఆనగానే గీతలు పడుతాయి. ప్లేటు గిరగిరా తిరగడమువల్ల గుండ్రముగా ప్లేటునిండా గీతలు పడుతాయి. ఇంకోటేమిటంటే యీ ముల్లు కంపిస్తూ వుండడము

వల్ల యీ గీతలు అన్నీ ఒకలా పడక అనేక రకాల వంకరలుగా వుంటాయి. ఎవరేనా "రాధా క్రిష్ణా" అని పాడుతూ వుంటా రనుకోండి "రాధా" అని అన్న ప్పుడు మెత్తని ప్లేటుమీద పడిన గీతలకీ "క్రిష్ణా" అని అన్నప్పుడు పడిన గీతలకి తేడా వుంటుంది అన్నమాట. ఈవిధంగా పాట అయ్యేటప్పటికి ప్లేటు, చివరనుంచి మధ్యకి రకరకాల వంకర్లుగల గీతలతో నిండుతుంది. ఈ గీతల్లో నుండే వంకర్లు కంటికి కనబడ నంత చిన్నవిగా వుంటాయి. తర్వాత ప్లేటు గట్టిపడుతుంది. అల్లా తయారైన ప్లేటును బట్టి అచ్చంగా దానిలాగే చాలా తయారుచేసి అమ్ముతారు.


సరే యింక ప్లేటు తయారైంది. దానిని వినాలంటే గ్రామఫోను కావాలి.

ఈ గ్రామఫోను యంత్రంలో సౌండుబాక్సు అని ఒకటుంటుంది.

ఈ సౌండుబాక్సులో ఒక పల్చని లోహపు పొరవుంటుంది. గ్రామఫోను ముల్లును సౌండు బాక్సుకి బిగించగానే ఆ ముల్లు వెళ్ళి లోహపు పొరకు ఆనుకొం టుందన్నమాట. గ్రామఫోనుప్లేటు గిరగిరా తిరిగే టప్పుడు ముల్లును ప్లేటుమీద ఆనిస్తాము. ప్లేటు మీదనున్న వంకర గీతలనుబట్టి ముల్లు కంపిస్తుంది. ఆముల్లునిబట్టి సౌండుబాక్సులోవున్న లోహపు పొరకూడా కంపిస్తుంది. ఏదైనా వస్తువు గాలిలో కంపిస్తే శబ్దం పుట్టుతుందని మనకు తెలుసును. "రాధా, క్రిష్ణా' అనేపాట పాడ డంవల్ల యేర్పడిన గీతలు ఆ ప్లేటు మీద వున్నాయి కనుక తిరిగి ఆ గీతల ప్రకారము సౌండు బాక్సులోనున్న లోహపు పొర కంపించడమువల్ల 'రాధా, క్రిష్ణా' అనేమాట మనకి వినిపిస్తుంది. అల్లాగే అనేక రకాలుగల పాటలు, మాటలు గల ప్లేట్లు వుంటాయి. శబ్దము బాగా వినిపించేందుకు బాకా **(horn)** అనేది గ్రామ ఫోనుకు వుంటుంది. ఇదీ గ్రామ ఫోను సంగతి. ఈ గ్రామఫోనును థామసు అల్వా ఎడిసన్ అనే అమెరికా దేశస్థుడు 1888 లో కనిపెట్టాడు.


# ఎవరు పట్టుకున్నారు?

సీతా, వేణూ, మోహన్—యీముగ్గురూ కలిసి ఒకనాడు షికారువెళ్లారు. వాళ్ల పెంపుడుకుక్క "లూసీ" కూడా వెంటబడింది. వాళ్లు అలా వెళ్లగా వెళ్లగా ఒకచోట "లూసీ" పరుగెత్తి పారి పోయింది. ఎంత పిలిచినా దగ్గరకురాదు!



ఆఖరికి విసుగెత్తి వాళ్లు ముగ్గురూ ఒక ఉపాయం ఆలోచించారు. ముగ్గురూ మూడు పెద్ద పెద్ద తాళ్లుతెచ్చారు. ఆతాడు కొనకి ఉరిపోశారు. ముగ్గురూ తాళ్లు విసిరారు, ఎవరితాడు ఆ "లూసీ" మెడలో పడిందో చెప్పగలవా? బొమ్మ చూసీ చూడడంతోటే చెప్పాలి. అట్టే సేపు చూడకూడదు.

# తీసివేత!




మేష్టారు బోర్డుమీద ప్రశ్న రాశారు:
"99నుండి 33 తీసివేస్తే ఎంత?"-
అని ప్రశ్న.

వేణు ఆలోచించాడు తీసివేతఅంటే
తీసివేయడం అన్నమాట...అంతే!

అదుగో వేణు ఒక అంపం తెచ్చి
బోర్డు పటపట కోశాడు. 33 అంకెను
వూడతీశాడు.

"99 నుండి 33 తీసివేస్తే మిగిలింది
99 దే సార్!"- అన్నాడు వేణు
గర్వంగా.

"అది తప్పు! 99 నుండి 33 తీస్తే
66 రావాలి" అన్నారు మేష్టారు.

"బస్! అలాగైతే బోర్డు తిరగేసి
చూడండి సార్" అన్నాడు వేణు!!

భలే బాలుడు వేణు!

# మా గోపాలు మామయ్య

రచన: గుంటూరు అన్నపూర్ణ (గుంటూరు)

మా బుల్లి మామయ్య పేరు గోపాలు. అందరి పిల్లలు లాగా కాకుండా గోపాల్ తగని తుంటరి. సరిగ్గా బడకిపోడు. ఒక వేళ పోయినా పాఠాలు సరిగ్గా చదవడు. మామూలుగా పదిగంటలకు అన్నంతిని పుస్తకాలనుతీసుకొని బడికి వెళ్లుతున్నానని చెప్పి దారిలోప స్నేహితులతోనో ఆడుకుంటూ ఉంటాడు.

గోపాలుకు ఒక ప్రయివేటు మేష్టారుకూడా ఉన్నారు. పాపం ఆయనకు కొంచెం మెల్లకన్ను ఉన్నది. గోపాలు ఆయనను తెగ ఏడిపిస్తూ వుంటాడు. మేష్టారువస్తే చాపకూడా వెయ్యడు. పాపంఆయనే తెచ్చి వేసుకుంటాడు. ఇంతా చేస్తే గోపాలు ఒకరోజుకూడా ఆయన దగ్గఱసరిగ్గా చదువుకోడు. ఆయన రాగానే,ఏదో ఒక వేషం వేసి చదువునకు పంగనామాలుపెడ్తాడు.

ఒకరోజున ప్రయివేటుమేష్టారువచ్చి, గోపాలుని పుస్తకాలతో రమ్మన్నాడు. ఆయన్నిచూడ్డంతోటే గోపాలు పెద్దపెట్టున ఏడవటం మొదలుపెట్టేడు. మేష్టారు ఏడుపుకుకారణం ఏమిటని ప్రశ్నించారు. గోపాలు పొట్టతరుక్కుపోయేటట్టుఏడుస్తూ "అయ్యోమేష్టారూ ఏంచెప్పేదండీ?పుస్తకాలు కనుపించలేదండీ! నేనెట్లా బ్రతికేదండీయిక? అయ్యో! నాచదువెట్లా నండీ? అయ్యో..." అని వగలు ఏడుపుతో గోపాలనేసరికి, మేష్టారుగారునమ్మి "పోనీలే యివాల్టికి ప్రయివేటు వద్దులే, రేపు పుస్తకాలు కొనుక్కో" అనిచెప్పి వెళ్లిపోయినారు.

మళ్లా మేష్టారు మర్నాడు వచ్చేసరికి యింటితలుపు లోపలవైపు గడియవేసున్నది. అందుచేత మేష్టారు: "గోపాలూ,తలుపు

తియ్యి” అనితలుపు కొట్టేరు. లోపలున్న గోపాలు మేష్టారి మాటలను విన్నాడు. ఆపూట చదువు ఎగ్గొట్టేందుకు ఒకపన్నాగము పన్నేడు. గొంతునుమార్చి, ఆడ వాళ్లగొంతుతో “మేష్టారూ! ఇవాళ మాగోపాలుకుమంచిజ్వరము వచ్చింది. పాపం బిడ్డపొద్దుట్నించి మూసినకన్ను తెరవడు. మీరు వెళ్లండి” అని అన్నాడు. మేష్టారు ఆమాటలనువిని, గోపాలు తల్లి చెప్పిందనుకొని వెళ్లిపోయినారు. ఇట్లాఉంటాయిగోపాలు చేష్టలు,

గోపాలుకు అనేకమందిస్నేహితులున్నారు. హనుమంతాయి, గతిలేనిగడుగ్గాయి, చెమిటిచెంచాయి, ముక్కులేని ముత్తాయి, మన గోపాలు స్నేహితులలో ముఖ్యులు. గోపాలుయింట్లోనుండి డబ్బులు,వడ్లుపోసుకొపోయిస్నేహితులతో వెలుగు తుంటాడు.మానెడో రెండుమానికలో వడ్లుపోసుక పోయిగుర్రిడ్డికోటమ్మ కొట్లోనూనెగారెలు, బజ్జీలు కొనుక్కొ తింటూఉంటారు.

గోపాలుగారింట్లో ఒకమూల గాదెఉన్నది. దాన్నిండావడ్లుంటాయి. గోపాలుఎవరికి కనుపడకుండా చీమ చిటుక్కుమనకుండా పోయి గాదెలో కూర్చుంటాడు. వాళ్లస్నేహితుల్లో ఒకడు ఎన్నికొలవాళ్లో చెప్పుతుంటాడు, వాళ్లేమంటారో తెలుసా?“లుపాగో,డునేమా”అని అంటారు. అంటే(తిప్పి చదవండి) “గోపాలు, మానెడు” అని అర్థం. గోపాలు మానెడు వడ్లని చాటుగా తీసుకొస్తాడు. వాటితో బజారుకెళ్లి వాళ్లంతాకొనుక్కు తింటారు. వాళ్ల భాషఎవరికి అర్థంకాదు గనుక, కొంతకాలంవరకు ఎవరూకనుక్కోలేకపోయినారు.

ఒకరోజున గోపాలుగారింట్లో పదిరూపాయలు నోటు పోయింది. దానినివాడేదొంగిలించేడు. వాళ్లనాన్న వెదకి,కనబడనందున గోపాలుని అడిగేడు. గోపాలు ‘ఒట్టునాన్న! నేనేమిఎరుగను. కావలిస్తే మా హనుమంతాయిని, గడుగ్గాయిని అడుగు.సరస్వతీదేవితోడునాన్నా” అని సత్యవంతుడిలాగ చెప్పేడు. నిజమేకాబోలు, గోపాలుతీయలేదేమోననివాళ్లనాన్న ఊరుకున్నాడు. గోపాలు బజారుకెళ్లి స్నేహితులకు అవీ యివీ కొనిపెట్టి జల్సా చేసాడు. కాని వాళ్ళల్లో వాళ్లకి భాగాలు కుదరలేదు. ఒకస్నేహితు

డికికోపంవచ్చి గోపాలు నాన్నతో గోపాలుమీద చెప్పవలసినవన్నీ పూసగుచ్చినట్లు చెప్పేడు. దాన్తో వాళ్లనాన్నకు యిదివరకు వున్న అనుమానం స్థిరపడింది. ఊళ్లోయింకా విచారించేసరికిఅబ్బాయికథబయటపడింది. బళ్లోకిపోయి హాజరుపట్టీని చూచేసరికి, ఎనిమిది నెలలకుపదిహేనుదినములు హాజరయినాడట గుడ్డికోటమ్మ కొట్లో అబ్బాయి పదిరూపాయల బాకీ తేలింది! వాళ్లనాన్నవళ్లు మండిపోయింది. గోపాను ఏంచేశాడో వేరేచెప్పాలా? కాళ్లకు కోదండంవేసి, స్థంభానికి అంటగట్టి, కొట్టేడుకదా, అబ్బ! ఏం చెప్పనూ! గోపాలు కొండపెట్టున ఏడ్చి దణ్ణాలు దస్కాలుపెట్టినా వాళ్లనాన్న కొట్టడం మానలేదు.

దానితోగోపాలు తెలివితెచ్చుకుని బుద్ధిమంతుడయాడు. ఇప్పుడు గోపాలంత బుద్ధిమంతుడు ఈఊళ్లోనే లేదు.




# పిల్లలూ!

మంచి బాగాచేవ్రాత రాస్తే మంచి మార్కులు పరీక్షలో వస్తాయి. జాబ్ కో ఫౌంట్ ఇంక్ తో రాస్తే ముత్యాల్లాంటి అక్షరాలు వస్తాయి. మీరు హిందూదేశములోని మంచి సిరానే వాడుచున్నా రనుకుంటాను. స్వదేశీ సిరా వాడడమే మంచి అలవాటు.




## జాబ్ కో ఫౌంట్ ఇంక్

ఇండియాలో మంచిది.


★

జయభారతం కంపెని

మదరాసు - బెంగళూరు - ఎర్ణాకులం.

# ★ సున్నాలా — గీతలా ★

సున్నాచుట్టి, గీతలు గీసి బొమ్మలు వేయుము బాలా!



ఇదిగో ఇదియొక మోస్తరు :-



# పోటీ రచనలు

మార్చి నెల "బాల" పోటీ పరీక్షలో బహుమతి పొందినవారి రచనలు ప్రచురిస్తున్నాం.

## I

మొదటి బహుమానం రూ. 10 పొందిన

చి॥ ఆదిరాజు సరళ (అప్పికట్ల) రచన:

# నేను చూచిన గమ్మత్తు

ఈ విషయమై ఏది వ్రాస్తే బాగుంటుందా? అని ఆలోచించాను. కాని, 'బాల' లో చూచిన గమ్మత్తు వ్రాస్తే బాగుంటుంది - అని తోచింది. బహుమానమువస్తే ఒక గమ్మత్తు. రాకపోతే అదోగమత్తు అనుకొన్నాను.

మార్చి నెల "బాల" లో 49-వ పేజీలో "నేను" అనే రచనను చూచాను. రచయితకు నాలుగుయేండ్ల వయస్సు అని వుంది. నాలుగుయేళ్ళ వయస్సు గలవారికి ఆ భూగోళ పరిజ్ఞానము వుంటుందా? వుంటే గమ్మత్తే! ఉన్నా "ఆంధ్రరాష్ట్రం" వంటి కఠినపు మాటలు వ్రాయగల శక్తి వుంటుందా? ఉంటే నిజంగా గమ్మత్తే!

ఆ రచయిత ఇంత చిన్నతనంలోనే కనీసము 3 వ తరగతియైనా చదువగలిగి యుండాలి. నాలుగేళ్ళ వయస్సులో మూడవ తరగతి చదువుతున్నాడంటే నిజంగా అది చాలా గమ్మత్తే!

"ఎడిటరు" గారు నమ్మటం ఒక గమ్మత్తు. చదువరులు నమ్మితే అంతకంటే గమ్మత్తు. నా యీ రచన "బాల" లో ప్రచురిస్తే గమత్తుగానే వుంటుంది. ప్రచురించకపోతే బలే గమ్మత్తు. ఈ 'గమ్మత్తు' లో వున్న 'గమ్మత్తు' అందరికీ తెలిసిన గమ్మత్తే!

# బాల గమ్మత్తు

రెండవ బహుమానం రూ. 6 పొందిన

చి॥ పిరాట్ల అచ్యుత రాధాకృష్ణ (కాకినాడ) రచన :

ఈ మధ్య మేము ఒక పెళ్ళికి వెళ్ళేము. పెళ్ళి చాలా గొప్పగా జరిగింది. రకరకాల పిండివంటలు చేసేరు. ఊరేగింపులు, గానసభలు హరికథలు వైభవంగా జరిగేయి. నాగవిల్లినాటి పొద్దున్న పెండ్లి కూతురుని బాగాముస్తాబు చేసి పల్లకిలో కూర్చోబెట్టేరు. ఎన్నో నగలు వేసేరు. పెళ్ళికూతురి అత్త గారు క్రొత్తకోడలి తలలో తన బంగారపు చేమంతి పువ్వుకూడా పెట్టిచూచి సంతోషించింది. పెండ్లి కూతురు పెండ్లికొడుకు కేసి చూస్తూ పరధ్యానంగా వుండగా ఆచామంతి పువ్వు ఎక్కడో జారి పడిపోయింది!

వస్తువు మాయమైన సంగతి త్వరలో అందరికీ తెలిసింది. అందరూ కంగారు పడ్డారు. ఇల్లూ వాకిలీ, పెట్టే, బేడా, మిఠాయి బుట్టలూ తెగ వెతికారు. కానిదొరక లేదు. పెండ్లికూతురు కంట తడిపె ట్టింది. పెండ్లి కొడుకు కూడా అంత పనీ చేసినట్లే. అంతా ఓదార్చారు. పెండ్లికూతురుతండ్రిగారు పోయిన వస్తువు ఖరీదు ఐదు పెద్దనోట్లుతీసి విచారంతోను, కోపంతోనూ వున్న వియ్యపురాలికి ఇచ్చుకు న్నారు.

ఇంతలో ఒక అందమైన అయి దేండ్లచిన్నపాప ఏడుస్తున్న పెండ్లి కూతురిదగ్గరకు వెళ్ళి "నా జేబులో ఒక చిన్న గమ్మత్తు ఉందిచూడు!" అంది. చూస్తే చేమంతి పువ్వు! పెండ్లికూతురి ఆనందానికి అంతు లేదు. పెండ్లికొడుకుపకపకానవ్వేడు. ఇంతగమ్మత్తూ ఒక చిన్నబాల చేసింది. బాలలు చేసిన గమ్మత్తులే బాగుంటాయి కదూ!

# చీమ గమ్మత్తులు

మూడవ బహుమానం రూ. 2 చొప్పున పొందిన వారి రచనలు:

## I

రచన : చి॥ క్రిష్ణవేణి (మదరాసు)

ఓనాడు మా అమ్మ మా ఇంట్లో బొబ్బట్లు చేసింది. అవి మేమంతా తిన్నన్ని తిన్న తరువాత మిగిలినవి జాగ్రిత్తగా ఒకగిన్నెలో పెట్టి వంటింట్లో అలమారులో దాచింది. చీమలు పట్టకుండా వుండడానికి ఒకపళ్లెంనిండా నీళ్లు పోసి ఆబొబ్బట్లగిన్నె ఆ పళ్లెంలో పెట్టింది.

ఆమరునాడుదయము బొబ్బట్లు తిందామని మా అమ్మని అడిగి గిన్నె మూతతీసి చూచేసరికి చీమలతో నిండిపోయింది. అంత జాగ్రిత్తగా మూతపెడితే చీమలు ఎలావచ్చాయో అని ఆశ్చర్య మేసింది!


అంతలో మానాన్నగారువచ్చి చూశారు. చీమలగమ్మత్తు ఆయన కి బోధపడి పోయింది. ఆచీమలన్నీ గోడంట ఎక్కి అలమారులో పైతట్టు సరిగ్గా గిన్నెకుమీదుగా పాకివెళ్ళి, ఆగిన్నెమీదికి దుబు కున దూకేస్తున్నాయి. అలా చీమలన్నీ గిన్నెమీదచేరి హాయిగా బొబ్బట్లుతింటున్నాయి. చూశారా చీమల గమ్మత్తు!

## II

రచన : అరిగెల వెంకటకృష్ణారావు

మాచవరం దగ్గర ఒకతోటలో ఒక గమ్మత్తు చూచాను. కొన్ని బత్తాయి చెట్లున్నాయి. ఒకచెట్టు మీద కొన్ని పుల్లచీమలున్నాయి. ఆచెట్టుకి దగ్గరగానే ఇంకో చెట్టు వుంది. ఈచెట్టుకొమ్మకు ఆచెట్టు కొమ్మకూ మధ్య జానెడు దూరం వుంది.

చీమలు ఈచెట్టునుండి ఆచె ట్టుకి వెళ్లడానికి ఒక గమ్మత్తు చేశాయి. ఒక చీమ తనవెనుక కాళ్లతో కొమ్మను పట్టుకొని తలక్రిందుగా వేలాడింది. దాని తలను ఇంకోచీమ పట్టుకొని వేల్లా డింది. అల్లాగే చీమలన్ని వంతెన చేసుకొని యీ చెట్టునుంచి ఆ చెట్టుమీదకు దాటాయి!




# చీమల రాజ్యంలో సీత

◆ ◆ రచన: "ఆరుద్ర" ◆ ◆

సీతా చీమా చెట్టపట్టాలు వేసుకొని చీమ యింటికి భోజనానికి బయలు దేరారు. దారి పొడుగునా ఇద్దరూ చాలా కబుర్లు చెప్పుకొన్నారు. కబుర్లు అంటే కబుర్లేకాదు. చాలా పెద్ద పెద్ద విషయాలు మాట్లాడుకొన్నారు.

సీత వాళ్ళ యింట్లో ఉన్న రేడియో తెలుగు ప్రోగ్రాములన్నీ వినేది. వార్తలు, పాటలు, పిల్లల ప్రోగ్రాము సమస్తం చాలా శ్రద్ధగా వింటూ ఉండేది. వార్తలతో తనువినే గాంధీజీ మాటలు, జిన్నా ఎత్తులు తనకి బాగా బోధపడకపోయినా చీమతో ఇవన్నీ చెప్పింది.

అబ్బో-చీమకివన్నీ తెలుసు. చీమలదేశంలో చాలా సంవత్సరాల కిందట గాంధి జిన్నా మొదలైన చీమల నాయకులుండేవారట. వాళ్ళు కిందా మీదా పడి, చీమల రాజ్యాపు స్వరాజ్యం కోసం పెద్ద దెబ్బలాట లేవదీశారట. చీమ ఇవన్నీ వాళ్ళ బడిలో చదువుకొన్నాదట. సీత, రేడియో ప్రోగ్రాముల లాగే చాలా శ్రద్ధగా చీమ చెప్పినవన్నీ విన్నాది.

ఇంకా చీమతో దారిపొడుగునా ఏమి మాట్లాడిందో సీత మర్చిపోయిందిట. ఈ రాజకీయాలు అన్నీ రాత్రి మనం నిద్ర పోయేటప్పుడు దీపాలు ఆర్పేసిన గదిలో

చీకటిలా ఉన్నాయి కాబట్టి సీతకి అవి అర్థంకాలేదట.

సీత చీమని "నీపేరేమిటి?" అని అడిగింది.

"సీతా, మనుష్యులలో మాదిరిగా మాలో పేర్లు ఉండవు. పేర్లకు బదులు నెంబర్లు ఉంటాయి. నా నెంబరు నలభైనాలుగు అంది చీమ.


సీత కిది ఆశ్చర్యంగా కనబడ్డాది. "అంటే" అన్నాది సీత.


నేను పదిహేడు లక్షల అరవై నాల్గువేల మూడువందల ఇరవై మూడవ జాతిలో నలభైనాల్గవ తరం చీమని. టూకీగా నన్ను 44 అని పిలుస్తారు." అని వివరించి చెప్పింది చీమ.

సీత ఈజవాబు మీద చాలా ప్రశ్నలు వేద్దామనుకొంది. మనుష్యులలో ఆడపిల్లలకి పెళ్ళి అయేక ఇంటిపేరు మారిపోతుంది. తను పెద్దత్త కొడుకుని సోమేశాన్ని పెళ్ళి చేసుకొంటే తన యింటిపేరు మారి పోతుంది.

చీమల రాజ్యంలో కూడా యిలా ఉంటుందా? సోమేశం పేరు తన పెళ్ళి అయేక తను అందరిలోనూ పైకి అనకూడదు! పెళ్ళిలో తలుపుల దగ్గర మట్టుకు చెప్పాలి. చీమలరాజ్యంలో కూడా ఇలా ఉంటుందా?

కానీ ఈప్రశ్నలు చీమని అడిగిందికి టయిము లేదు. చీమల





పిలుపుల ఇల్లు

రాజ్యం దగ్గర పడ్డాది. "చీమా! నిన్ను నలబైనాలుగు అని పిలవడం బాగులేదు. మాకుక్క పేరు జానీ, ఆపేరుతో పిలుస్తాను." అంది సీత. "కానీ" అంది చీమ.

చీమలరాజ్యానికి చాలా పెద్ద గేటు ఉంది. సుమారు మూడు వందల మంది తుపాకులు పుచ్చుకొని గేటుదగ్గర కాపలా కాస్తున్నారు. గేటుదగ్గర సీతని, జానీని వాళ్ళు నిలబెట్టేశారు.

జానీ తన జేబులోని కాగితాలని తీసి గేటుదగ్గరున్న వాళ్ళకి చూపెట్టింది. వాళ్ళు సీతని వాటి మీద సంతకం పెట్టమన్నారు. సీత సంతకం పెట్టింది. జానీ సీత కలిసి లోపలకి వెళ్ళేరు.

లోపల, ఒక ఎలక్ట్రిక్ లాంతరు లాంటిది చాలా వెలుతురు ఇస్తున్నాది. సీతకి వాళ్ళ ఊళ్ళో మెయిన్ రోడ్డుమీద వెలిగే ఆకుపచ్చ - కాదు - ఊదారంగు దీపం జ్ఞాపకం వచ్చింది.

ముందు జానీ తోవచూపెడుతున్నాది. సీత జానీ వెనకనడుస్తున్నాది. సీతని కాపాడిందికి వెనకాతల పోలీసులున్నారు.

చీమలరాజ్యంలో రోడ్లు చాలా పెద్దవి. రెండుప్రక్కలా చెట్లు చల్లని గాలీ, నీడా యిస్తున్నాయి. రోడ్డుమీద ఎవరూ చీమలు నడవటంలేదు.

ఆ తరవాత సీతకి తెలిసింది. వాళ్ళ రాజ్యం చూసేందుకు సీత వస్తున్నా దని రాకపోకలు ఆపి వేశారట!

సీతని చాలా పెద్ద ఇంట్లోకి జానీ తీసుకొని వెళ్ళింది. ఆయింట్లో చాలా బల్లలు కుర్చీలు ఉన్నాయి. అది ఒకబడి అనుకొంది సీత. కానీ అది "పిలుపుల ఇల్లు" పై దేశాలనుండి ఎవరేనా వస్తే ముందు అక్కడికి తీసుకొని వెళ్తారట.

"సీతా! ఇక్కడ జరగ వలసిన లాంఛనాలు ఒకగంటలో అయిపోతాయి. తరవాత మనకి చాలా పని ఉంది. మనం ప్రెసిడెంటు గారు వచ్చేక భోజనం చేస్తాం. నేను ఇప్పుడే వస్తాను. ఉండు" అంది జానీ.

"అదేమిటి జానీ" మీాయింటికి భోజనానికి అని అన్నావు. ప్రెసిడెంటుతో భోజనం. ఇదేమిటి?" అంది సీత గాభరాతో.

"అయ్యో, పిచ్చితల్లీ మా రాజ్యంలో అందరికీ ఒకటేయిల్లు. అందరం ఒక నట్టింట్లోనే భోజనం చేస్తాం. నీకు మారాజ్యం గురించి అంతా చెప్తాను కదా? తొందరెందుకు?" అంది చీమ.


# తల్లీ — పిల్లా

పాపలు

ఎండుగాను

పీలగాను

ఎందుకు వుంటారు ?

తల్లులు బలంలేకుండా

జబ్బువారైతే

వారికి పుట్టిన పిల్లలు కూడా

ఆలాగే వుంటారు.

స్త్రీల జబ్బులకు మంచి మందు ఏదంటే—

## లోధ్ర

ఈ పేరు అందరూ విన్నదే- అయినా దీనిని గురించి మీా అమ్మతో చెప్పండి.

"లోధ్ర" దొరికే చోటు:

కేసరీ కుటీరము లిమిటెడ్.

రాయపేట - మదరాసు 14.

# తాతయ్య సలహాలు

"చైత్ర వైశాఖ మాసములలో
ఎండలు మెండుగా కాయును"

ఇల్లాగని మీరు పుస్తకాల్లో చదువుతున్నారా? నా చిన్నప్పుడు నేను ఇదివినాను. ఎండలు చిత్త కార్తిలో చిట్ట మాడేస్తాయి. రోహిణీ కార్తిలో రోళ్లే పగుల్తాయిట ఎండలకి!

మీ కందరికీ ఇప్పుడు శలవులు. ఇంకేం మీకందరికి ఖులాసా. ఒకటే ఆటలు, అల్లరి. ఎండవేడి అసలే కనిపించదు, ఉక్కపొయ్యానే పొయ్యదు.



నా చిన్నప్పుడు నేను మీలాగే మిట్టమధ్యాహ్నపు ఎండలో, తెగ ఆడేవాడిని. ఓరోజున మంచి ఎండలో ఆడుతూంటే, నా స్నేహితుడికి వడగొట్టి, గుడ్లు తేలేసి, నాలుక బైటపెట్టి పడిపోయాడు! మాకు ఖంగారెత్తి మా నాన్నతో పరుగెత్తివెళ్ళి చెప్పా. మా నాన్న చెంబెడు నీళ్ళట్టుకొచ్చి మొఖం మీదకొట్టి, నోట్లో యిన్ని నీళ్లోసి ఎన్నో ఉపచారాలు చేశాడు. కొంచెం సేపటికి వాడు తెప్పిరిల్లి కళ్లు తెరిచాడు

ఎండల్లో తిరగకుండా, చక్కా ఇంట్లో ఏ బువ్వాలాటో, చింత గింజలాటో, గవ్వలాటో, వామన గుంటలాటో ఆడుకుంటూ సాయంత్రం ఎండ తగ్గిం తరువాత ఆరుబయటాడే ఆటలాడుకుంటే, ఆరోగ్యంగా వుంటుంది.

ఇంకోవిషయమర్రోయ్! శలవులిచ్చారు కదా స్కూళ్లకని, మరి అసలు చదువుమాటే మరిచిపోకండీ. మంచి మంచి కథలు పుస్తకాలు చదవండి. అల్లికలు, కుట్టుపనులు, యిటువంటివి యింకా ఎన్నో ఆడపిల్లలు నేర్చుకోవచ్చు. విజ్ఞానవిషయాలు, చారిత్రక విషయాలు, ఎవళ్ళనేనా అడిగి మీకు సులభంగా అర్థమయే చిన్న చిన్న పుస్తకాలు చదవండి.

ఈ శలవుల్ని మాత్రం వృధా పోనియ్యకండి ఎండల్లో ఆడి.



# పొడుపు కథలు

1

వీధిలోని మనిషి - వికారపు మనిషి

ఒకరువస్తే లేవడు

ఇద్దరువస్తే లేస్తాడు......ఏమిటి?

సంపాదన: చామర్తి వెంకట పద్మావతి. (బెజవాడ)

2

ఇళ్లులేని పట్నాలు; నీళ్లులేని సముద్రాలు

ఉండే దేమిటి?

3

మూడుకాళ్ల ముసలమ్మ నీళ్లుత్రాగి

కొయ్య మింగుతుంది......ఏమిటి?

4

కాకినాడనుండి మదరాసుకు

కదలకుండా పోయేది......ఏమిటి?

6

పూయని మొగ్గేమిటో;


పండు అనిపించుకోని కాయ ఏమిటో?

కాయ అనిపించుకోని పండేమిటో?

చెప్పుకో......................

సంపాదన: మంధా విశ్వేశ్వరరావు, పార్వతీపురం.

(జవాబులు జూలైసంచికలో)




కానన్ ష్మిడ్ కు

వేలూరి శివరామశాస్త్రి

అనుసరణం

# సరిహద్దు రాయి

అనంతయ్యా కాపురం చేసే యిల్లు, పండ్లచెట్లూ పూల మొక్కలూ కల ఒక చిన్నతోటలో ఉంది. దాని పక్క నున్న పచ్చిక బీడు అంతుమయ్యది. అనంతయ్యకు బీడు కొంత కలుపుకోవాలని దుర్బుద్ధి పుట్టింది. అతడు ఒకనాటి రాత్రి ఎవరూ లేకుండా చూచి సరిహద్దురాయి ఆవలికి జరిపాడు.

కొన్నాళ్లు గడిచినై. అనంతయ్య ఒకనాడు మామిడి చెట్టుకు నిటారుగా నిచ్చెన వేశాడు. చివర మెట్టుమీదికి వెళ్లేసరికి, నిచ్చెన బరికింది. అనంతయ్యతల విసురుగా పోయి సరిహద్దురాతి మీద పడి కొబ్బరికాయ పగిలినట్టు పగిలింది. అనంతయ్యగనుక ఆ రాతిని జరుపుతుంటే పచ్చికలో పడి బతకగలిగేవాడు. కాబట్టి సరిహద్దురాతిని జరపరాదని ఇలా సామెత ఐపోయింది.

సరిహద్దురాతిని జరిపెడువాడు
మరణించు దానిపై మతియొక్కనాడు.

★

# చిలుక

“అమ్మా చిలకే! అమ్మా చిలకే!” అని జోతి పోరు పెట్టడం మొదలుపెట్టింది.

ఓసి జోతీ! నీవు తిన్నగా చదువుకోవు, చెప్పిన మాట వినవు, అక్కరమాలిన పనులు మాత్రం నీకు కావాలి, "అదేమిటీ? ఇదేం దుకూ?" అంటూ అపాయం కలిగించే పనులలో వేలు పెడతావు. నీ వీ పనులు మానుకుని, చెప్పిన మాట విని, చేయవలసిన పనులు బద్ధకించకుండా చేసిననాడు, నీకు చిలుక వస్తుంది అని అన్నది. "నీవు చెప్పినట్లు చేస్తా చూడు" అని జోతి అన్నది.

ఒకనాడుజోతిబళ్లోంచివచ్చింది. తల్లి "జోతీ అదిగో ఆ బల్లమీద ఒక పెట్టెకనబడుతూంది చూచావా? ప్రాణం మీదికి వచ్చినా దాన్ని తెరవకు, దాన్ని ముట్టుకోకు, దానిదగ్గరకు పోబోకు. నీవు నామాట వింటే నీ వనుకొన్నది వస్తుంది." అని చెప్పి తాను పప్పూ అప్పూ తెచ్చుకోవడానికి పొరుగింటికి వెళ్లింది.

తల్లి బయటి కడుగు పెట్టగానే జోతి గబగబా పోయి పెట్టె ఎత్తి చూచి "ఇదేమిటీ! ఇంత తేలికగా వుంది? దీనికి కంతలు కూడా ఉన్నై" అని అనుకుని దాని మూత తెరిచింది. లోపల ఉన్న చిలుక ఎగిరి తపతప రెక్కలు కొట్టుకుంటూ గదిలోగంతులు వేస్తూంది. తల్లి వచ్చి చూస్తుందేమో అన్న భయంతో జోతి దానివెంట తిరుగుతూ ఆ గది అంతా కళ్లం తొక్కుతూంది. ఇంతలో తల్లివచ్చి తలుపు తీసింది. చిలుక తుర్రు మంది!

ఆక్కఱ మాలిన యతి కుతూహలము
అక్కటా యెవ్వరి కది హాలహలము

★

# వాన పిచ్చుకలు

వానాకాలంమొదట్లో వాన పిచ్చుకలు బిలబిలా వచ్చి ఒక కాపు ఇంటిముంజూరుకు గూళ్లు వేలాడదీసి కిచకిచలాడుతున్నై. ఆ కాపు తన కొడుకులను పిలిచి "వీనికి మీ రేమీ అపకారం చేయకండి, లేవగొట్టకండి, వీట్లను వెళ్లగొట్టేవాడు తన అదృష్టాన్ని కూడా వెళ్లగొట్టుకుంటాడు సుమండీ" అని చెప్పాడు.

"అదేమిటి నాన్నా?" అని కొడుకులడిగారు.

తండ్రి వాళ్లను చూచి- "పొరుగింటి వీరయ్య పిచ్చుకగూళ్ల నన్నిటినీ పీకేసి గుడ్ల నన్నిటినీ చితిపేశాడు. వాడి సంసారము కూడా చితికిపోయింది చూడండి" అని చెప్పాడు.

"దాని కిదేమి కారణం నాన్నా?" అని కొడుకులు ప్రశ్న వేశారు.

వాళ్ల తండ్రి ఇలా చెప్పాడు: వీరయ్య తన తండ్రితాతల దయా దాక్షిణ్యాలు మరిచిపోయాడు. అతని తండ్రి తాతలు నోరు లేని జంతువులను చాలా దయతో చూచేవారు. అందరికీ ఉపకారం చేసే యీ పిట్టలను మరీ దయతోనూ ఓర్పుతోనూ చూచేవారు. వారు ఈపిచ్చుకల కిచకిచలకు తెలవారకమునుపే లేచి తమతమ పనులకు పోతూ వుండేవారు. ఈ వీరయ్యో, పిట్టలూ జంతువులూ ఒకటే ఇతనికి. వట్టి కసాయి. కల్లుపాకే వీరయ్య కిల్లు. తెలవారబోయే ముందు పడుక కింటికి వస్తాడు. అప్పుడు పిచ్చుకలు కిచకిచలు మొదలెడతై. వాటితో వాడికి నిద్రాభంగం. అందుకని వాడు దుడ్డుకర్రతో వాటినన్నిటినీ చావ చితక్కొట్టాడు. గుడ్లను చెడామడా చితకతొక్కాడు. ఓర్పూనేర్పూ లేని యీ వీరయ్య పిచ్చుకలనూ వెళ్లగొట్టుకున్నాడు; అదృష్టాన్ని వెళ్లగొట్టుకున్నాడు.

పిచ్చుకల్ వచ్చుచోఁ బ్రీతి రానిండు
వచ్చును మెలకువ వానితోఁ జుండు.

★

# పావురాలు

వనమాలీ రామకోటీ ఇరుగు పొరుగింటివాండ్లు. వాళ్లిద్దరూ చాలా చురుకైన కుర్రవాళ్లు. వనమాలి భాగ్యవంతుల బిడ్డ. అతని కెన్నో అందమైన పావురాళ్లు ఉన్నవి. ఇక రామకోటి పేదవాళ్ల యింటి బిడ్డ. అతని కున్నవి మామూలు పావురాళ్లు. అవి అయినా ఎన్నో లేవు.

ఒకనాడు వనమాలి పావురాల జత ఒకటి రామకోటి గుడిసెల్లో వాలి అక్కడ గూడు చేసుకున్నై. రామకోటి వానిని చూచి "ఇవి వెండికన్ను తెలుపు, వీట్ల

తలలూ తోకలూ చీకటికన్న నలుపు. వనమాలి పావురా లన్నిటిలో ఇవే నాకు చాలా బా గుంటవి. ఇవినావిగనుక అయితే ఎంత అదృష్టవంతుణ్ణి!" అని అను కున్నాడు.

వాట్లను తీసుకొని దాచేసు కుందా మనే అభిలాష రామకో టిని కిందట్లు మీదట్లు చేసింది. "ఛీ! ఈ పనికి నే నోడబడరాదు, ఇది మహాపాపం, ఈ దుర్బుద్ధిని నేను వెంటనే అణచివేసుకోవాలి" అని అనుకుని అతడు గుడిసె తలుపు మూసి, ఆ పావురాలను పట్టుకొని వెంటనే వనమాలి కిచ్చేశాడు.

వనమాలి ఆ పేదకుఱ్ఱవాని మంచితనానికి చాలా సంతో షించాడు. కొన్నాళ్ళకు వనమాలి రామకోటికి తెలియకుండా అతని గుడిసెలోకి వెళ్ళి రామకోటి ఎఱ్ఱపావురపు గుడ్లు రెండు తీసి తనపావురపు గుడ్లను రెంటిని అక్కడ పెట్టి వచ్చాడు.

ఎఱ్ఱపావురం ఆ గుడ్లను పొది గింది. అవి పిల్లలయినై. అవి వెండివలె తెల్లగానూ చీకటివలె నల్లగానూ కనబడగానే వింతపడి రామకోటి వనమాలిదగ్గరకు పరు గెత్తి ఆ వింత చెప్పాడు.

వనమాలి నవ్వి—"నీ మంచి బుద్ధి చూచి నేనే నాగుడ్లు తెచ్చి నీ యెఱ్ఱ పావురపు గుడ్లలో పెట్టాను" అని చెబుతూ ఇలా అన్నాడు:

సద్బుద్ధి కలవాని చక్కటి కెందు
కావలసిన కోరికలు వచ్చి చెందు

## రచయితలకు మనవి:

మీరు పంపిన రచనలు తిరిగి పంపుటకు వీలుపడదు. అందుచేత మీ రచన ఒక కాపీ మీవద్ద ఉంచుకొని, మరొక కాపీ మాకు పంపండి. పోస్టుబిళ్లలు అనవసరముగా పంపవలదు. రచనలు బాగుండే మేమే వేస్తాం. సం॥

# నాణ్యము — ధరలు

బట్టల వ్యాపారములో నాణ్యము - ధరలు ఈ రెండూ
ముఖ్యముగా గమనింపవలసిన విషయములు.

మంచి నాణ్యము, సరసమైన ధరలూ కావాలంటే చేనేత బట్టలనే కొనవలెను.



మాచే తయారుచేయబడు చీరెలు, ధోవతులు, తువాళ్లు, షర్టింగులు
మొదలగు వాటిపై ముద్రింపబడిన సరసమైన కంట్రోలు ధరలను
మీరు కొనినచో మా బట్టల నాణ్యము మీకే తెలియును.

మదరాసులోను, అన్ని జిల్లాలలోనూ వుండే
మా విక్రయశాలలలో దొరకును.

## మద్రాసు హ్యాండ్ లూమ్ వీవర్స
## ప్రావిన్షియల్ కోఆపరేటివ్ సొసైటీ లి.

నెం. 6-ఎ. వుడ్సురోడ్ - మౌంటురోడ్, మదరాసు.

# ఇది కాని ఇది — ఏది?

కబా కలా! కఈ కది కగు కవు కన కవి కపో కల్చు కకో —

కోడికాని కోడి — పకోడి
కాలుకాని కాలు ?
గొడుగు కాని గొడుగు ?
పండు కాని పండు ?
కొమ్ముకాని కొమ్ము ?
పాలుకాని పాలు?
సందుకాని సందు ?
నూలుకాని నూలు ?
డోలుకాని డోలు?
రాయికాని రాయి ?
మానుకాని మాను ?
సారికాని సారి ?
సాలుకాని సాలు ?
సాముకాని సాము ?
సీలకాని సీల ?
కారుకాని కారు ?
ధనంకాని ధనం ?
బంటుకాని బంటు ?
పిట్టకాని పిట్ట?
చిలుకకాని చిలుక ?
కప్పకాని కప్ప ?

చెవికాని చెవి ?
కోట్టు కాని కోట్టు ?
ధనస్సుకాని ధనస్సు?
కలంకాని కలం ?
దయకాని దయ ?
తంత్రంకాని తంత్రం
పతికాని పతి
సారంకాని సారం
కారముకాని కారము
బడికాని బడి
కులంకాని కులం
బొమ్మకాని బొమ్మ
ఏరుకాని ఏరు
మండలముకాని మండలము
తెరకాని తెర
నత్తకాని నత్త
కాశికాని కాశి
మానముకాని మానము
మరకాని మర
వలకాని వల
కీలుకాని కీలు

సంపాదన: పాన్; మల్లిక్; జంగ; మాధవ; దంటు కృష్ణమూర్తి; అ. సూర్య నారాయణ; వి. ప్రసాదరావు; యం. ముకరంహుసేన్; కాజా బాల త్రిపురసుందరి.

# సున్నా విలువ

రచన : బూసం సుబ్బారావు (వేటపాలెం)

బాలా!

నీకు లెక్కలలో ఎప్పుడైనా సున్నావచ్చిందా? వస్తే భయ పడకు. ధైర్యంతెచ్చుకొని ఆ సున్నాపక్కన ఇంకో సున్నాచుట్టి దానిపక్కన ఒకటివెయ్యి— సులువుగా 100 అవుతుంది.

సున్నావిలువ అంతేకాదు. మన తెలుగు అక్షరాలన్నీ గుండ్రంగా సున్నాలోంచి పుట్టినవే! అంచేతే మన తెలుగుఅక్షరాలు ముత్యాల్లాగుంటాయి. నువ్వు ముత్యాల్లాంటి అక్షరాలు రాయడం నేర్చుకో.

అసలు మనకందరికీ వెలుతురు ఇస్తున్న సూర్యుడి ఆకారం ఎలా గుందీ? పెద్ద సున్నాకదూ? అలాగే భూమికూడా గుండ్రంగా వుంది. చందమామకూడా సున్నాయే. నక్షత్రాలుకూడా గుండ్రంగానే వుంటాయి.

భూమి గిరగిర సున్నాలాగ తిరుగుతుంది.

రైలుబండి చక్రాలు మోటారుచక్రాలూ, సైకిల్ చక్రాలూ, ఎద్దుబండి చక్రాలూ అన్నీ సున్నాలే!

చూశావా బాలా! సున్నా యొక్క విలువ? అందుచేత నువ్వు లెక్కల్లో ఒక్కసున్నామాత్రమే తెచ్చుకోక రెండు సున్నాలూ, పక్కన ఒకటీ తెచ్చుకో! అంటే నూటికి నూరు మార్కులు తెచ్చుకో!



# అంకెల తమాషా



సంపాదన: వ. రామకృష్ణారావు (విశాఖపట్టణం.)

999 × 9 = 8991

888 × 8 = 7104

మొత్తం 1887 = 1887 భేదం

అల్లాగే

888 × 8 = 7104

777 × 7 = 5439

మొత్తం 1665 = 1665 భేదం

అల్లాగే

77777 × 7 = 544439

66666 × 6 = 399996

144443 = 144443

66666 × 6 = 399996

55555 × 5 = 277775

122221 = 122221

ఇలాగే ఎన్ని సంఖ్యలైనను తీసుకొని దానిని ఆ సంఖ్యచేత గుణించి పైవిధంగా చేసినచో, మొత్తము, భేదమునకు సమానం అవుతుంది. చూశావా తమాషా?



బాల కార్యాలయానికి వచ్చిన

# పుస్తకాలు - వాటిని గురించి

## నా జీవితము:

మహాత్మా గాంధీ తన జీవితాన్ని గురించి గుజరాతీభాషలో ఒక పుస్తకం రాశారు. దానిని మహదేవ దేశాయి గారు ఇంగ్లీషులో తర్జుమా చేసి, బడి పిల్లలు చదువుటకు వీలుగా రాశారు. ఆ ఇంగ్లీషు పుస్తకాన్ని మన తెలుగులోకి శ్రీ పోలవరపు శ్రీరాములు గారు అనువాదించారు. ఈ పుస్తకం అందరూ చదవాలి. ఇందులో పుస్తకం ఆఖరికి గాంధీగారి బొమ్మలు-చిన్నప్పటి నుంచి ఇప్పటివరకు - అనేక రకాలవి అచ్చువేశారు. వెల రూ. 1-8-0-

★

## ప్రపంచ చరిత్ర (మొదటి భాగం)

జవహర్‌లాల్ నెహ్రూగారు యీ పుస్తకం తాను జైలులో వున్న రోజుల్లో రాశారు. తన కూతురు ఇందిరకు ప్రపంచ చరిత్ర తెలియాలని, వుత్తరాల రూపంగా రాశారు. ఈ పుస్తకాన్నే తెలుగులోకి శ్రీ చింతాదీక్షితులుగారు చక్కగా అనువాదిస్తున్నారు. మొదటి భాగం క్యాలికోఅట్టతో 204 పేజీలది తయారయింది. హైస్కూలు తరగతులు చదువుతున్న బాలబాలికలు ఈపుస్తకం చదివితే ప్రపంచ చరిత్ర అర్థమవుతుంది. వెల 2 రూపాయలు. ఈ పైరెండుపుస్తకాలూ కావాలంటే కల్చరల్ బుక్స్ లిమిటెడ్ పెరంబూరు, మద్రాసు 11 అని రాయండి.

★

## హరిజన విజయము (బుఱ్ఱ కథ)

హరిజనులుపడే కష్టాలు, గాంధీగారి ఉద్బోధ అన్నీ కలిపి కథగా సులభంగా అర్థమయే శైలిలో రాశారు. పుస్తకం వెల 6 అణాలు. దొరకుచోటు: సుందరరాం అండ్ సన్సు, పబ్లిషర్సు, తెనాలి.

★

## భారతాభ్యుదయము:

రచన: భీ. సాంబశివశర్మ. ప్రకాశకులు: శ్రీరామా బుక్ డిపో, మార్కెటు వీధి, సికిందరాబాదు. వెల 0-8-0 ఈ పుస్తకంలో మనహిందూ ధర్మం గురించి శ్రీ విద్యారణ్య యతీంద్రులవారి చరిత్ర జంగంకథ వరుసలో రాయబడింది, బాగుంది.

పాతకాలంనాటి

# చిన్నపిల్లల పాట



సంపాదన : చింతా దీక్షితులు

చిన్నారి నామం పెట్టవే
అమ్మయ్యానాకు -
పొన్నారి తొడుగు తొడగావే;

వేళ్ల ఉంగ్రాలు పెట్టవే
అమ్మయ్య నాకు -
భమిడి మొలత్రాడు గట్టవే;

వీథుల్ల నాడు మనవే
అమ్మయ్యనన్ను -
వీరాధి వీరుడనవే;

సందుల్ల నాడు మనవే
అమ్మయ్య నన్ను -
సరసీజమాను[1] డనవే

ఊదాకాల[2] చేతికివ్వవే - అమ్మయ్య
నేను - భద్రగిరి
రాముబాణము లాడి వచ్చెద.

---

రేలంగి కాపురస్తులగు శ్రీ యామజాల కృష్ణమూర్తిగారు చెప్పగా వ్రాసుకొన్నది. ఇందు 1. 'సరసిజనేత్రుడనవే'; 2. 'ఊతకోల' కావచ్చును.

తక్కువ ధరలకు

మేలురకపు నవీన



# చేతిగడియారములు

(రిష్టువాచీలు)

రూ 97 మొదలు రూ 40 వరకూ

రకములు గలవు.

కనీసం 1 సం॥ మొదలు 5 సం॥ వరకూ

గ్యారంటీ యివ్వబడును.

వాచీ మరామత్తులు మా ప్రత్యేకత!

## రిజ్వాన్ అండ్ బ్రదర్సు,

217, చైనాబజారు రోడ్డు; జి టి; మద్రాసు.

ప్రొప్రయిటరు : ఫజ్లుల్లా

(జలాల్ కంపెనీలో పూర్వం ఛీఫ్ సేల్సుమన్, ట్రావలింగ్ ఏజంటు.)




# తాతయ్య కండ్లకథ

మనుమడు: "తాతా! నువ్వు 'బాల'ను చదివినావా?"
తాత: "లేదు నాయనా! నాకు కండ్లు సరిగా కనబడవు"

మనుమడు: "అలాగైతే నువ్వు

# నేత్రవృద్ధి తైలము

ఎందుకు ఉపయోగించవూ?

మాబడిలో రంగయ్య నాన్న ఈ తైలము ఉపయోగించి ఇప్పుడు బాగా చదువుతూ వ్రాస్తున్నాడు."

తాత : అది ఎక్కడ దొరుకును? దాని వెల ఎంత?

మనుమడు : డాక్టర్ వి. ఎన్. పిళ్ళైగారి

శ్రీ రాజ రాజేశ్వరీ సిద్ధ ఆయుర్వేద నిలయము,

15, జనరల్ సామినాయక వీధి, తిరువల్లికేణి, మదరాస్ అని

రాస్తే దొరుకుతుంది.

వెల రు 1-12-0 మాత్రమే (ఏజంట్లు కావలెను.)

# లేదు — కద్దు

ఈ సంచికలో 33-వ పేజీలోని పద్యాలు ఇలాగ చదువుతే అర్థం సరిగా ఉంటుంది :

బెల్లము తీపి ;
లేదు పేదవానికి ధనము ;
కద్దు నల్లనికాకికి ఇలను ;
లేదు నినుగొల్చినవానికి కీడు -
రాఘవా !

అలాగే

చింతకు పులుపు ;
లేదు ఎఱ్ఱచీమకు తొండము ;
కద్దు జాజిపూబంతికి వాసన ;
లేదు నినుగొల్చినవానికి కీడు -
రాఘవా !




# మే "బాల" లోని

## ప్రశ్నలకు జవాబులు

ఇది చెప్పుకో చూద్దాం?

I


ఒకటే ఒక మాట

II

గదిలోనికి తిరిగివచ్చినపుడు ఒక కుర్చీని కూడా వెంటా తీసుకొనిరావాలి. అప్పుడు, తన కాళ్లురెండు, కుర్చీకాళ్లు నాలుగు కలిసి మొత్తం ఆరుకాళ్లు !

III

మూడుకోతలు ఇలా కొయ్యాలి, పది ముక్కలవుతాయి.



కాకి — కుక్క

కాకికి తనజాతిపై ఎక్కువ విశ్వాసం; ఒకకాకి ఏదైనా తినుబడివస్తువు చూస్తే అది అన్నికాకుల్నీ కావుకావని పిలుస్తుంది. కాని కుక్క తన జాతివారిని దగ్గరకు రానీయదు.

పొడుపు కథలకు జవాబులు

1. హార్మోనియం లేక మురళి:
2. గాలివిమానం
3. వార్తాపత్రిక
4. కొబ్బరికాయ

Announcing the inauguration
on 6th July, 1947

**ANDHRA HERALD**

**An independent English weekly exponent of Andhra life and achievement**

***Managing Editor :***

**Vaidyula Ramana Rao, B.A.**

***Annual Subscription Rs. 10***
***Single copy As. 3***

**WANTED AGENTS**

***Manager :***

**The Andhra Herald**
**4, Stringer St., G. T., Madras**

## 'అనసూయ'

సంపాదకుడు: వి.వి.యల్. ప్రభాకర్

లలితకళాశాఖ సంపాదకులు: అనసూయా సీతాదేవులు.

కళా సాహిత్యాల సమన్వయానికీ, స్త్రీల వికాసానికి, భావి భారతపునర్నిర్మాణానికీ, ఆంధ్రాభ్యుదయానికీ, అన్ని రంగాలలోనూ పునరుజ్జీవనానికీ కృషి చేసే సర్వతోముఖ వైజ్ఞానిక పత్రిక.

జూలై 1వ తేదీనుంచి వెలువడుతుంది.

ఎడ్రసు:

**No 3, Crescent Park St,**
**T. Nagar, Madras 17.**

ఆయుర్వేద వైద్యనిలయంవారి

## "లుకోరియా క్యూర్"

స్త్రీ గర్భాశయ సంబంధమైన సమస్త వ్యాధులను నిర్మూలించుటలో నిధియని 10 సం|| అనుభవముచే చెప్పగలుగుచున్నాము. దీనిని సేవించిన పూర్ణారోగ్యము గలిగి వంధ్యత్వము తొలగిపోవును. అనేకమంది దీర్ఘ రోగులకు వాడి గుణము పరీక్షింపబడిన ఆయుర్వేదఔషధ రాజము.

90 మాత్రల ప్యాకెట్టు . రూ. 2-8-0

ప్యాకింగు పోస్టేజి ప్రత్యేకము:

అన్ని మందులషాపులలో దొరకును.

(మా చిరునామాలో మార్పును గమనించుడు)

## ఆయుర్వేద వైద్యనిలయం

రామనాయుడుపేట :: మచిలీపట్టణము.

# బాల బహుమానాలు

ఈ నెల "బాల" చందాదారుల నెంబర్లు లాటరీ తీయగా ఈ దిగువ చందా దారులకు 1 రూ. చొప్పున బాల బహుమానం వచ్చింది.

—మేనేజరు.

| | చందా నెం॥ |
|---|---|
| కె. సత్యనారాయణచెట్టి, మదరాసు | 660 |
| జి. శ్రీనివాసరావు, టీచర్, యానాం | 871 |
| జి. సత్యనారాయణగుప్త, తెలుగుపండిట్, నెల్లూరు | 553 |
| జమీందార్ ఆఫ్ రాచూరు, పల్లికొండ పోస్టు | 318 |
| కందా భీమశంకరం, ఎడ్వొకేటు, మదరాసు | 82 |
| కె. లక్ష్మీకుమారి, విశాఖపట్టణం | 466 |
| సూరి విద్యాధరి, ముషీరాబాద్, హైదరాబాదు | 1065 |
| ఆర్. నారాయణస్వామి, ప్రెసిడెంట్, విద్యార్థి కాంగ్రెస్, వి. బి. పల్లి........ | 1033 |
| టి. శ్యామలాదేవి, టి. నగర్, మదరాసు | 496 |
| సెక్రెటరీ, విద్యార్థిసంఘం, లక్ష్మీనరసింహ విద్యాలయం, ఇసకదామర్ల | 247 |






# అక్కతో 5 నిమిషాలు

చిట్టి చెల్లాయిలూ!

చిట్టి తమ్ముళ్లూ!

వినండి. క్రిందటి నెల ఒక చెల్లాయి ఉత్తరం:

అక్కా,

మాయింటికి 'బాల' వచ్చింది. చూసీ చూడ్డంతోనే మా తమ్ముడు పరుగెత్తుకుంటూ వెళ్లి చప్పున తీసుకున్నాడు. నేనెంత అడిగినా ఇవ్వడు. నాకు బలే కోపంవచ్చింది. ఒక్కసారి చూడ్డానికైనా ఇచ్చేడు కాడు. నేనువెళ్లి అమ్మతో చెప్పేను. "ఉండు, వాడు చదువుకొని నీ కిస్తాడులే. ఊరుకో, అస్తమాను దెబ్బలాడకండి" అని అమ్మ అనేసింది. నాకు అమ్మమీద కోపంవచ్చి, నేను రాత్రి అన్నంతినడం మానేశాను.

అక్కయ్యా, బాలపుస్తకం నేనోసారి అడుగుతే తప్పా? నువ్వేచెప్పు! నీదగ్గర నుండి జవాబు వస్తేనేకాని నాకోపం పోదు. జవాబురాయి.

ఇట్లు

నీ చెల్లాయి.

అని రాసింది. చెల్లాయి కోపం పోవడానికి, నేను వెంటనే జవాబు రాసేను.

కానీ, చెల్లాయిలూ, తమ్ముళ్ళూ, ఒక్కమాట చెప్తున్నా వినండి. మనం చీటికీ మాటికీ కోపం తెచ్చుకోకూడదు. 'ఊఁ' అంటే అమ్మమీద కోపం 'ఆఁ' అంటే తమ్ముడు మీద కోపం తెచ్చుకుంటే మంచిదా? మీతమ్ముడు పుస్తకం తీసుకుంటే పాపం అమ్మేంచేస్తుంది చెప్పు? తమ్ముడికి మాత్రం బాలఅంటే సరదాకదూ! అదీగాక నీకంటే చిన్నవాడు కూడాను, మంచిమాట లాడుతే తమ్ముడే ఇచ్చేస్తాడు. ఇంతమాత్రానికే అమ్మతో ఫిర్యాదా! తమ్ముడూ నువ్వూ దెబ్బలాడుకోకండి. తమ్ముడు మంచివాడుకదూ!

ఇంకోసంగతి. ఇట్టే అమ్మమీద కోపం తెచ్చుకుని అన్నం తినడం

మానవచ్చునా? తప్పు కాదూ? అందుకే మన ఆరోగ్యం ఇలా వుంటోంది! ఏదో కోపం తెచ్చుకుని వేళకి భోజనమానేసి అలగడం, పగలంతా ఆకలిలేక పోయివాసరే, అమ్మదగ్గర డబ్బులు పుచ్చుకుని ఒకటే చిరుతిళ్లు కొనుక్కుని తినడం ఇటువంటి పనులుచేస్తే అమ్మకి ఎంత కష్టమో ఆలోచించు. అమ్మ ఇంట్లో పనులే చేసుకుంటుందా, నాన్నగారి సంరక్షణే చూస్తుందా, మీఅల్లర్లూ కోపాలే తీరుస్తుందా, చిరుతిళ్లవల్ల కడుపునొప్పితో బాధ పడుతూ మీరు ఏడుస్తూవుంటే, మీసంగతే చూస్తుందా; అమ్మకి ఎంతకష్టం!

అంచేత, చెల్లాయీ! వేళకిఅమ్మ అన్నంపెడితే ఒద్దనకమ్మా. అనవసరంగా అమ్మమీద కోపం తెచ్చుకోకు. అనవసరంగా డబ్బులిమ్మని అవీ ఇవీకొని పెట్టమని, అల్లరి చేయకేం? మనఅమ్మ మంచిది కదూ? నువ్వు బుద్ధిగా వుంటే సంతోషం. అల్లరిపిల్లవైతే అమ్మకి విచారం.

అక్క.

# బాల సంఘాలు

## పళాసా రైల్వే విద్యార్థి సంఘం :

ఈ సంఘం తే 18-5-47 దీని సభ చేసి, తెలంగాణాలోని ఆంధ్ర బాలల కష్టాలకు సానుభూతి చూపుతూ, చుట్టు పట్ల గ్రామాల్లో ప్రాథమిక విద్యా వ్యాప్తికి పాటుపడుటకును, ఒక చరఖా తరగతి పెట్టుటకు తీర్మానములు గావించిరి.

## సుభాస్ బాలసంఘం (మొయిద)

మే నెల 20 తేదీన, 53 సభ్యులతో సభ జరిగింది. శ్రీ సాంబశివరాజుగారు జయప్రకాశ్ నారాయణ్ గార్ని గురించి మాట్లాడేరు.

## బాలపుస్తకాలయం (రాజమండ్రి)

లక్ష్మివారపేటలో శ్రీ జి. సుబ్రహ్మణ్యం, యన్. గోవిందరావు, వీర్రాజు; పి. కేశవరావు; ఎన్. లక్ష్మినారాయణ గార్లు యీ పుస్తకాలయ స్థాపించారు. ఇందు చాలామంది బాలురుచేరి బహు ఉత్సాహంతో, పెద్దల సహాయంతో పనిచేస్తున్నారు. వీరికి జయముగుగాక !

## ఇసకదామర్ల విద్యార్థిసంఘం:

మే 17 వ తేదీని యీసంఘం, శ్రీ ఎ. వి. నరసింహంగారి అధ్యక్షతనుకూడి శ్రీ బి. పాపయ్య, ఎ. వెంకటరమణయ్య,

చి॥ చలమయ్యగార్లను కార్యవర్గంలో ఎన్నుకొన్నారు. సంఘసమావేశములు తరుచుగా జరిపి, పిల్లలకు విజ్ఞాన విషయములు నేర్పుచు, బడికిరాని పిల్లలను ప్రోత్సహించుటకు తీర్మానించడమైనది. ఉపాధ్యాయులకు తగుజీతము లివ్వవలెనని ప్రభుత్వమువారిని కోరుతూ తీర్మానించడమైనది.

### సుభాస్ బోస్ బాలసంఘం
### (వాల్తేరు.)

మే 4 వ తేదీని, 30 మంది సభ్యులతో సభ జరిగింది. శ్రీ ప్రసాద్ గారు ఉపన్యశించారు. వి. కాశీనాధ్ గారు అధ్యక్షులు; ఏ. వెంకటరావు కార్యదర్శి. సభ జయప్రదంగా, అల్లరిలేకుండా జరిగింది.


### చిలకలపాడు నేతాజీ బాలసంఘం:

ఇది గత జనవరినుండీ పనిచేస్తోంది, సభ్యులు 16 మంది. వి. సత్యనారాయణగారు, వి. వెంకటకృష్ణశాస్త్రిగారు యీ సంఘంనడుపుతున్నారు. పిల్లలు ప్రతిరోజు సాయంత్రం డ్రిల్లు చేయుచున్నారు.

### అరకువోయ బాలసంఘం.


మే 25 వ తేదీని యీ సంఘం ప్రారంభం. 100 మంది బాల బాలికలూ, పెద్దలూ వచ్చారు. శ్రీ దాస్, డిప్యూటీ కలక్టరుగారు అధ్యక్షత వహించారు. డాక్టర్ ఎన్. దేశాయిగారు యీ సంఘం యొక్క ఉద్దేశములు తెలియజేశారు. పాటలూ, పద్యాలూ, 'బాల' లోని వింతలూ తమాషాలతో కాలక్షేపం అయింది. అల్పాహారములతోనూ, జాతీయ గీతములతోనూ సభ ముగిసింది.

## నరసాపురం బాలసంఘం



ఇటువంటి బాలసంఘాల ఫోటోలు పంపిస్తే ప్రచురిస్తాం — సం॥

# బాలలకు నూతన అందమును చేకూర్చే
# రాజా ఆభరణములు




| | | | |
|---|---|---|---|
| గాంధీ, నెహ్రూ, సుభాస్‌బోస్, సాయిబాబా, శ్రీ కృష్ణ, శ్రీరామ ఫోటోలుంగల వుంగరము | 1 కి | రూ\|\| | 3-2-0 |
| నీలం, ఆకుపచ్చ కలర్సుగల 1 రాయివుంగరం | ,, | ,, | 3-0-0 |
| సెలులాయిడ్, నీలం, ఆకుపచ్చ, ఎరుపుకలర్సు చక్రంలోలాకులు | ,, | ,, | 4-0-0 |
| సెలులాయిడ్, నీలం, ఆకుపచ్చ, ఎరుపుకలర్సు. జూకా లోలాకులు | ,, | ,, | 6-0-0 |
| మైనరు బేబీ చైను 18 ఇంచీలది | ,, | ,, | 5-0-0 |

ఆర్డరు ఇచ్చిన వెంటనే వి పి. ద్వారా పంపబడును పోస్టుఖర్చులు 0-12-0 అణాలు ఇంకా అనేక ఆభరణములుగల క్యాటలాగు వలయువారికి ఉచితంగా పంపబడును.

## రాజా గోల్డు కవరింగ్ కంపెనీ (రిజిష్టర్డు)

Post Box No 22, రాజా బిల్డింగ్సు; రాజుపేట, మచిలీపట్టణం

---

ఏప్రిల్ 'బాల'లో వేసిన జూకా లోలాకుల ధరలు.

130 H 131 H 132/1.4 H 132 H 231 H 232 R 230 H

## మే నెల పోటీలో బహుమానాలు



# 16 గురు పంచుకున్నారు!

'మే' నెల బాల పోటీలో చాలమంది రచనలు పంపారు. అందరూ బాగానే రాశారు. సంతోషం. అయితే బహుమానాలు అందరికీ వస్తాయా? అక్కడే వచ్చింది చిక్కు! అంచేత ఈ నెల మూడు బహుమానాలూ కలిపేశాము. బాగా రాసిన యీదిగువ 16 మందీ ఆ మొత్తము పంచుకుంటారు.

—సం॥

1. జె. సత్యారావు (రాజమండ్రి)
2. మీరాఖాన్ (అంబాజీపేట)
3. కోకా సుందర సుబ్బారావు (కర్నూలు)
4. తంగిరాల రామశర్మ (అవనిగడ్డ)
5. మైనంపాటి కమలకుమారి (బెజవాడ)
6. బావరాతు రాజేశ్వరి (కోరాపుట్టి)
7. పి. అచ్యుత రాధాకృష్ణ (కాకినాడ)
8. మామిడన్న సత్యనారాయణ శర్మ (చిలకలపూడి)
9. మోటమర్రి చలమయ్య (చిట్టివలస)
10. టి. రామదాసురెడ్డి (తరిమెల)
11. ఎన్. సర్వేశ్వరరావు (విజయనగరం)
12. వేలమూరి నరసింహారావు (రేపల్లె)
13. కలపటపు రామచంద్రరావు (దొడ్లపాలెం)
14. నీలం వైదేహి (మదరాసు)
15. చిట్టి - బాల సోదరులు (ఖరగ్‌పూర్)
16. యడవల్లి శ్యామసుందరరావు (ఒంగోలు)

ఒక్కొక్కరికీ రూ 1-4-0 చొప్పున మణియార్డరు పంపబడును.

చిన్న సలహా:—మీరు పంపే రచనలు తమాషాగానూ, హాస్యంగానూ వుండాలి. అబద్ధాలు రాయకూడదు.

—సం॥

# ★ "బాల" పోటీపరీక్ష ★

జూన్ నెల

| | | |
|---|---|---|
| మొదటి బహుమానం | రూ. | 10 |
| రెండవ బహుమానం | రూ. | 6 |
| మూడవ బహుమానం | రూ. | 4 |

పిల్లలకు గొప్ప అవకాశం! ఉత్సాహం! ఆనందం!

ఈనెల పోటీ ప్రశ్న ఇది:

## మా బడి

మీ బడిని గురించి ఒక చిన్న రచన, రెండు పేజీలకు మించకుండా (పావుఠావుసైజులో) రాయవలెను. నీవు బాగా రాస్తే నీకు యీ పై మూడు బహుమానాలలో ఒకటి రావచ్చును.

## మీ రచనతో 4 అణాలు పంపండి

★ నాలుగణాలు మనియార్డరుగాని, నాలుగు అణాబిళ్లలుగాని పంపండి. పావలా బిళ్లలు పంపవద్దు.

★ ఈ పోటీలో 15 ఏళ్లకు లోపువారే చేరాలి.

★ కవరుమీద "బాల పోటీ" అని పెద్ద అక్షరాలతో రాయాలి.

★ మీ రచనలు మాకు జూన్ 25 తేది లోపుగా చేరాలి.

ఈ పోటీలో 'బాల' ఎడిటర్‌గారి అభిప్రాయమే ఖాయము.

ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

పై విలాసం ఇలా రాయండి:

"బాల పోటీపరీక్ష"
c/o "బాల" 3, తంబుశెట్టి వీధి, మదరాసు 1.



బాలల్లారా!

మీకు పజిల్ అంటే ఏమిటో తెలుసా? అదిగో పక్క పేజీలో చూడండి. ఒక చదరంవుంది. ఆ చదరంలో కొన్ని గదులలో అక్షరాలున్నాయి. కొన్ని నల్లగదులుకూడా వున్నాయి. కొన్నిగదులు ఖాళీగా వున్నాయి.

ఇప్పుడు మీరు ఏమిచేయాలంటే - ఖాళీగావున్న గదులలో అక్షరాలు నింపాలి. ఎలాగ? ఏ అక్షరాలు నింపాలి? ఏ అక్షరాలు నింపితే సరియైనమాట అవుతుందో ఆ అక్షరాలు నింపాలి. అది తెలుసుకోడానికి 'సూచనలు' ఇచ్చాము. అవి చదవాలి.

ఇప్పుడు పక్కపేజీలోనే దిగువున చూడండి "అడ్డంవరుస సూచనలు" "నిలువువరుస సూచనలు' అని వున్నాయి. అడ్డం వరుసలో 1టో నెంబరు సూచన '1. పిల్లల బొమ్మల పత్రిక' అనివుంది. వెంటనే మీకు "బాల" అని తెలిసిపోతుంది. అలాగే 3 నెంబరు సూచన; 4 నెంబర్ను సూచన - ఇలాగ సూచనలు చూచుకొని అడ్డం వరుసమాటలు, నిలువు వరుసమాటలు నింపాలి.


ఎవరు అన్నిగదులూ సరిగా నింపుతారో వారిపేర్లు జూలై సంచికలో వేస్తాం. డబ్బు కట్టనక్కరలేదు.

"పజిలన్నయ్య"

c/o 'బాల' 3, తంబుశెట్టి వీధి, మద్రాసు.

# బాలవినోదపజిల్ ...... 1

చదరం




సూచనలు


**అడ్డం వరుస**

1. పిల్లల బొమ్మల పత్రిక
3. దీనికి పాటఅంటే చాలాప్రీతి
4. ఇతరుల ఇది పట్టుకోకు!
8. ఇవి శుభ్రంగావుంటేనే ఆరోగ్యం
9. కొందరు పిల్లలకు ఇదిసరదా
10. ఏనుగు
11. నువ్వు బుద్ధిగావుండే ముద్దు; లేకపోతే ఇది!

**నిలువు వరుస**

1. కొందరు తండ్రిని ఇలాపిలుస్తారు
2. నక్కపిల్లి ■ ■ పిడతలకు ప్రశిద్ధి
5. ఒక వూరిపేరు
6. కొందరు మునులకు ఇది బహుప్రీతి!
7. మన ఆరోగ్యానికి ఇది చాలా అవసరం
10. కలదు.

- ఈ పజిల్ పంపడానికి డబ్బుకట్ట నక్కరలేదు.
- చదరం " బాల " పుస్తకంలోనిదే కత్తిరించి పంపాలి.
- చదరాలు జూన్ 25 తేదీలోపుగా మాకు అందాలి.



# బాల డైరి

[బాలలు డైరీ రాయడం నేర్చుకోవాలి. డైరీ రాస్తే ఎంతో ఉపయోగం. మేము ఈ నెల మదరాసులోని చి|| వల్లూరి సావిత్రి పంపిన డైరీ ప్రచురించాం. చదవండి.-సం||

తేది.

## మే

1. మాబావ గదిలో ఏంచేస్తున్నాడో అని కిటికీలోంచి తొంగి చూచాను. కిటికీతలుపు టక్కుమని తలకితగిలింది. అబ్బ, ఒకటేనొప్పి.

2. ఇవాళ సాయంత్రం నేను, శకుంతల, రామం, బీచికి వెళ్లాం, ఇసుకలో ఆడుకున్నాం.

3. మా అన్నయ్య మోటారుసైకిలు కొన్నాడు. ఆ చప్పుడువింటే నాకు తలనొప్పి.

4. ఇవాళ మాయింటికి ఒకతాటాకు శుభలేఖ వచ్చింది. తాటాకుమీద అక్షరాలు ఎంతోబాగున్నాయి. రేడియోపిల్లలందరికీ ఆ శుభలేఖ చూపించాను.

5. ఇవాళ మాపరీక్షలు తెలిశాయి, నేను పాసయేను; పాపం, సుందరి పరీక్ష పోయింది.

6. ఇవాళ నేను, మాతమ్ముడు, చెల్లాయి, పాపని బండిలో తీసుకుని బీచికి వెళ్లేం. బోలెడన్ని గుల్లలు ఏరుకొని ఇంటికి తెచ్చుకున్నాం.

7. ఈరోజున పెద్ద బొగడపూలదండ లక్ష్మి ఇచ్చింది, అన్నీ నేనే పెట్టేసుకున్నాను. చెల్లాయికికోపంవచ్చింది.

8. ఇవాళ నేనూ, భారతి కలిసి షాపుకి వెళ్లి గాజులు కొనుక్కున్నాం, ఎంతోబాగున్నాయి.

9. ఇవాళ మాయింటికి 'బాల' పత్రిక వచ్చింది. పోటీరచనలు వెయ్యలేదు, ఎందుకు వెయ్యలేదో?

10. నేను పువ్వులగుడ్డలతో ఒక సంచీ కుట్టేను. చక్కగా వుంది.

11. ఇవాళ రేడియో ప్రోగ్రాంకి వెళ్లేను. చావలి కరుణకుమారి ఒకపెళ్లికొడుకు బొమ్మ తెచ్చింది. అనుకోకుండా నే గిడుగి సావిత్రి ఒకపెళ్లికూతురు బొమ్మ తెచి ంది, బొమ్మల్ని అందిరికీ చూపించేము. రేడియో అక్కయ్య బొమ్మలపెళ్లి చేయమంది. వచ్చే నెలలో చేస్తాం.

12. నేను చక్కెరకేళీ అరటిపండు తిని, తొక్కలు ఇంటిమధ్య పడేశాను. పాపం, మాతమ్ముడు దానిమీద కాలువేసి జారిపడ్డాడు. అమ్మ నన్ను కోప్పడింది.

13. ఇవాళ నాపెట్టె, బట్టలు, పుస్తకాలు అన్నీ శుభ్రంగా సర్దుకున్నాను.

14. నా బొమ్మకి సిల్కు పరికిణీ కుట్టేను. ఆకుపచ్చ జరీఅంచు వేశాను. ఎంతో బాగుంది.

15. నా బొమ్మకి పూసలతో లోలాకులు, వడ్డాణం, నెక్లేసు చేశాను.

16. ఇవాళ నేను ముచ్చిరేకులతో రెండు దండలు కట్టేను, ఒకటి మాకృష్ణుడు మెళ్లో వేశాను. ఇంకొకటి రేడియో అక్కయ్యకి ఇచ్చాను. దండలు జిగజిగ మెరుస్తున్నాయి.

17. సాయంత్రం నేను, భారతి, పాప, అందరం కలిసి బీచికివెళ్ళేం.

18. ఇవాళ రేడియో పిల్లల ప్రోగ్రాం బిచ్చపిల్లనాటకం, వాన తాతయ్య నాటకం చాల బాగున్నాయి.

19. ఇవాళ కొబ్బరి ఆకుల్తో బూరాలు, బొమ్మలు చేసుకుని ఆడుకున్నాం.

20. ఇవాళ మాఅమ్మ, అందరికీ కొత్త బట్టలుకొంది.

21. సాయంకాలం, మాబావతో మేమందరం బీచికివెళ్ళేం. వేరుశనగలు, బటాణీలు కొనుక్కుతిన్నాం.

22. మాపాప, చిన్నరామం, అక్కయ్య, బావ, ఊరుకి వెళ్లిపోయారు. స్టేషన్లో రైలు కదిలేసరికి నాకు ఏడుపువచ్చింది.

23. ఏమీ తోచడంలేదు. పాతబాలలన్నీ తిరగేశాను

24. రేపటి ప్రోగ్రాం కనుక్కునేందుకు రేడియో అక్కయ్య ఇంటికి బయలుదేరేను. తోవలో స్నేహితులు కనిపిస్తే, వాళ్లతో ఆడుకుంటూ కూర్చున్నాను.

25. ఇవాళ రేడియో ప్రోగ్రాం. ఇంటికి రాగానే, అమ్మ, అన్నయ్య అందరం కలిసి ఎగ్జిబిషన్‌కి వెళ్లేం. అక్కడ ఒకగుడివుంది, దాంట్లోకివెడితే, మేం నడవకుండానే దానంతటఅదే మమ్మల్ని తిప్పుతూ దేవుళ్ళని చూపించింది. చాల తమాషాగావుంది.

26. శకుంతల, పాపాయి దొంగతనంగా వేరుశనగలు కొనుక్కుని మేడమీద తినేస్తున్నారు. నేను చూసేను. నాకు కోపంవచ్చింది.

27. పక్కింటి వసంతా, మేమూ "రింగు" ఆడుకున్నాం.

28. పాపం భాగతికికంటిమీద పెద్దకురుపు వేసింది, చాలా బాధ పడుతోంది, రేపు డాక్టరు దగ్గరకితీసుకువెడతారట.

29. ఇవాళ రాత్రి దావులూరి వారింటికి పెళ్లికివెళ్ళేం. నేను కొత్తరిబ్బను పెట్టుకుని, కొత్తబట్టలుకట్టుకున్నాను.

30. మా యింటివెనకాల కొబ్బరితోటలో మేం ఆడుకుంటూవుంటే, ఒక కల్లుకుండ చెట్టుమీదనుంచి కిందపడి విరిగిపోయింది. రామం చూసి జడుసుకున్నాడు. మేం వెంటనే ఇంటికి వెళ్లిపోయేం.

31. ఇవాళ సాయంకాలం లీలగారింట్లో ఆడుతున్నాం, సాయంకాలం ఇంటికి వెళ్లి 'బాల' డైరీ పూర్తిచేసి బాలన్నయ్యకి పంపించేను.



# రేడియో

## పిల్లల తెలుగు ప్రోగ్రాముల వివరాలు

[ 211 మీటర్లు, 31.36 మీటర్లమీదా వినొచ్చు. ]

[ ప్రతి ఆదివారం మధ్యాహ్నం 2-15 నుంచి 3 వరకు ]

### జూన్

8-వ తేది ఆదివారం :

రారె చిన్నపిల్లలార; ఉత్తరాలసంచి; బాలవీరుడు (నాటిక); పుట్టింరోజులు; కొత్తపాటలు; అంట్రుళ్లా (హాస్య నాటిక); కథలూ; పోదామా.

15-వ తేది ఆదివారం :

రారె చిన్నపిల్లలార; ఉత్తరాలసంచి; విచిత్రవీణ-నాటిక; పుట్టింరోజులు; చిక్కుప్రశ్న తాతయ్యకథ; తమాషాలగుత్తి; పోదామా ఇక.

22-వ తేది ఆదివారం :

రారె చిన్నపిల్లలార; ఉత్తరాలసంచి; జైభేతాళ!-నాటిక; పుట్టింరోజులు; కొత్తపాటలు, చంపకాయ-నాటిక; చిక్కుప్రశ్న; కథలూ కబుర్లూ; పోదామా.

29-వ తేదీ ఆదివారం

రారె చిన్నపిల్లలార; ఉత్తరాలసంచీ; తెలివిగల పిల్లవాడు (నాటిక); పుట్టింరోజులు; చిక్కుప్రశ్న, కుక్క పిల్లి (హాస్యనాటిక); కథలూ అవీ; పోదామా.

### జూలై

6-వ తేదీ ఆదివారం

పిలుపుపాట; ఉత్తరాలసంచీ; పడవ పిల్ల (నాటిక); పుట్టింరోజులు; వరదల్లో (రూపకం) చిక్కుప్రశ్న; మీపాటలూ కథలూ; పోదామా:


Edited and Published by N. Raghava Rao, 20, Sundareswar St., Mylapore, Madras 4. Printed by Dr. S. Seshagiri Rao at the Lodhra Press, Kesari Kuteeram Ltd., 15, Westcott Road, Royapettah, Madras-14.




అన్ని నొప్పులనూ పోగొట్టే

అందాల బాల

# అమృతాంజనము


వాహినీవారి
యోగి
వేమన
డైరెక్టరు – కే. వి. రెడ్డి B.Sc (Hons)
ఈ క్రింది నగరములలో ప్రదర్శింపబడుచున్నది.
బెజవాడ—సరస్వతి
రాజమండ్రి— జయా
విజయనగరం — కృష్ణా
కర్నూలు — ఆనందా
బళ్లారి — ప్రభాత్
బందరు — మినర్వా
చీరాల—గోపాలకృష్ణా
చిత్తూరు — ప్రేమలా
శ్రీకాకుళం-రామకృష్ణా
ఏలూరు-పాండురంగా
బెంగుళూరు, ఇతర నగరాలలో తేదికై నిరీక్షించండి
Directed by
K.V.REDDI, B.Sc (HONS)
Associate K.KAMESWARARAO B.A.
THE VAUHINI PICTURES LTD., MADRAS... BEZWADA ...TADPATRI...